

వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోంది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 21.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 121 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00






# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు!

- రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్..
- 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది
- విభజన హామీల పరిష్కారంపై చంద్రబాబు ప్రతిపాదనలు
- 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం

**మహాబలిపురం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి--బెంగళూరు--చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు.

**తిరుపతి నుంచి అయోధ్య వరకు తీర్థయాత్ర సర్క్యూట్ :** దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో


• వివరాలు 2 లో


## అరణ్యానికి సాంకేతిక రక్షణ కవచం!

- అడవిలో ప్రతి కదలికపై నిఘా..
- కర్ణాటక నమూనాలో అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- డ్రోన్లు, జీఐఎస్, కెమెరా ట్రాప్‌లతో డిజిటల్ పర్యవేక్షణ..
- ఈ-గస్తు యాప్‌తో సిబ్బందిలో జవాబుదారీతనం
- కర్ణాటక అటవీ శాఖ అధ్యయన నివేదికను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న తరహాలో అత్యాధునిక సాంకేతిక పరిపాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి అంగుళం అటవీ భూమిని సంరక్షించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అరణ్యారామంలో కర్ణాటక తరహా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

ఈ వ్యవస్థ ద్వారా అడవుల మ్యాపింగ్‌తోపాటు వన్యప్రాణుల కదలికలు, అటవీ కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో డిజిటల్ నిఘా ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీ శాఖ బృందం కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించింది. కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న ఐటీ విధానాలు, మిగతా 2లో...

## సభ సజావుగా.. సమావేశాలు ముగిసేలా!

- నాలుగు రోజుల్లో 25 గంటలకుపైగా కార్యకలాపాలు.. 12 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం
- 103 మంది సభ్యుల ప్రసంగాలు.. మూడు లఘు చర్చలు
- 16వ శాసనసభ ఏడో సమావేశాలు నిరవధిక వాయిదా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ ఏడో సమావేశాలు నాలుగు రోజుల పాటు కొనసాగి ముగిశాయి. మిగతా 2లో...

## జిల్లా కలెక్టరేట్లకు కొత్త రూపు!

- నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి.. డిజైన్లు సిద్ధం
- భీమవరం సహా పలు జిల్లాల ప్రతిపాదనలపై త్వరలో తుది నిర్ణయం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో జిల్లా కలెక్టరేట్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.

## ఆర్టీఈ అడ్మిషన్లు పెరిగాయి!

- 2022-26 మధ్య 1,04,046 మంది విద్యార్థులకు అవకాశం: లోకేష్
- ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలుకు పెద్దపీట
- ఆన్‌లైన్ ప్రక్రియతో పారదర్శకంగా ప్రవేశాలు
- 2022-23లో 2,203 మంది.. 2026-27లో 28,742 మందికి అడ్మిషన్లు
- ఆర్టీఈపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాప్రభుత్వ పాలనలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2022-23 నుంచి 2026-27 వరకు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1,04,046 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 12(1)(సి) సెక్షన్ కింద ప్రవేశాలు పారదర్శక ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా చేపట్టాం. 12(1)(సి) సెక్షన్ ను సమర్థంగా అమలుచేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాహక్కు చట్టం కింద విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. మిగతా 2లో...

## 'జూడా' ల అభిప్రాయాలకే ప్రభుత్వం పెద్దపీట

### 'జూడా'లపై కాఠిన్యం కాదు... వాత్సల్యమే ప్రభుత్వ అభిమతం

- జూనియర్ డాక్టర్లతో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చర్చలు
- మూడు డిమాండ్లలో రెండింటిని తక్షణమే అంగీకరించిన మంత్రి
- ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపు ప్రతిపాదన ఇక లేదు
- ఎంఎస్సీ పీహెచ్‌డీ వారిని నాన్-క్లినికల్ పోస్టుల్లో భర్తీ చేయం
- ఒక్క స్టైఫండ్‌ను మాత్రమే డిమాండ్ చేసినంత స్థాయిలో చేయలేకపోతున్నాం
- స్టైఫండ్‌ను 15 శాతం పెంచే శక్తి లేదు ... 5 శాతం పెంచి ఏటా 3 శాతం పెంచుతాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్నాం
- ప్రభుత్వం చేస్తున్న ఈ యజ్ఞంలో జూడాల సహకారం ఎంతో ముఖ్యం
- ఈ క్లిష్ట సమయంలో రాష్ట్రానికి అండగా నిలవండి... సమ్మె విరమించండి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా స్టైఫండ్‌ను 15 శాతానికి పెంచలేకపోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ప్రతినిధులకు తెలియజేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపు, ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తిచేసిన వారిని నాన్-క్లినికల్ పోస్టుల్లో నియమించడంపట్ల జూడా ప్రతినిధులు వ్యక్తంచేసిన ఆందోళన పట్ల మంత్రి సానుకూలత వ్యక్తంచేశారు. అయితే.. స్టైఫండ్ పెంపు డిమాండ్‌పై పునరాలోచన చేసి, వెంటనే విధులకు హాజరుకావాలని తనను కలిసేందుకు వచ్చిన జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యుల సేవలు కీలకమైనవని, వారి పట్ల సానుభూతి ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ముందుకు వెళ్లలేకపోతున్నామని పేర్కొన్నారు. జూడా అధ్యక్షుడు డాక్టర్ యు.ఈశ్వర శంకర్, ఉపాధ్యక్షుడు జి. భార్గవసాయి నాయుడు, ఇతర ప్రతినిధులు గురువారం సాయంత్రం శాసనసభ ప్రాంగణంలో మంత్రి సత్యకుమార్‌ను కలుసుకుని తమ విజ్ఞప్తులను తెలియచేశారు. మిగతా 2లో...



## పట్టణ మౌలిక వసతులకు భారీ ఊతం!


- హెచ్ఏఎం కింద రూ.7,469 కోట్లతో అభివృద్ధి పనులు
- స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి అనుగుణంగా ముందడుగు
- రోడ్లు.. డ్రైనేజీ.. పార్కులు.. వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి
- మిగిలిన 4,388 కి.మీ. పట్టణ రహదారుల అభివృద్ధి
- పట్టణాలను నివాసయోగ్యంగా, పెట్టుబడులకు అనుకూలంగా తీర్చిదిద్దే లక్ష్యం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. పట్టణ స్థానిక సంస్థల్లో రోడ్లు, డ్రైన్లు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద రూ. 7,469.46 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో రూ. 5,500 కోట్లు మూలధన పనులకు, పదేళ్ల కాలానికి అంచనా వడ్డీగా రూ. 1,969.46 కోట్లు ఉన్నాయి. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆగస్టు 19న జీఓఆర్‌టీ నంబర్ 1067 జారీ చేసింది. రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో వివిధ పథకాల కింద మొత్తం రూ. 40,743.67 కోట్ల విలువైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులు అమలు, మిగతా 2లో...

## తరగతి గదిలో విషాదం!

- టీచర్ దాడి చేశారని ఆరోపణ..
- ఆరేళ్ల బాలుడు మృతి
- విశాఖ లిటిల్ గార్డెన్ స్కూల్‌లో ఘటన..
- ముగ్గురు సభ్యుల కమిటీతో సమగ్ర విచారణ



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో దారుణం జరిగింది. టీచర్ కొట్టడంతో తరగతి గదిలోనే ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ కుప్పకూలిపోయాడు. విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాబు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. హోంవర్క్ చేయలేదని టీచర్ మందలించడంతో పాటు దాడి చేయడం కారణంగానే ప్రణయ్ మరణించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కేజీహెచ్‌లో బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారిని కొట్టిన టీచర్‌తో పాటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు మిగతా 2లో...

## 'జూడా'ల అభిప్రాయాలకే
# ప్రభుత్వం పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి)

స్టైఫండ్ 15 శాతానికి పెంచాలని మరోమారు కోరారు. అలాగే ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపుపై వైద్య వర్గాల్లో జరుగుతోన్న చర్చపట్ల వారు ఆందోళన వ్యక్తంచేయగా మంత్రి అటువంటి ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదని స్పష్టంచేశారు. ముఖ్యంగా ఖాళీల దృష్ట్యా సూపర్ స్పెషాల్టీ వైద్యుల ఉద్యోగ విరమణ వయసు పెంపు గురించి ఓ సమీక్షా సమావేశంలో చర్చ మాత్రమే జరిగిందన్నారు. ప్రస్తుతానికి అటువంటి ప్రతిపాదన ఏదీ లేదని, ఏ నిర్ణయమైనా వైద్యులతో సంప్రదించిన తర్వాతే నిర్ణయాలు జరుగుతాయని, ఏకపక్షంగా నిర్ణయం ఉండదని స్పష్టంచేశారు.

**ఆందోళన వద్దు:** ఎన్ఎంసీ మార్గదర్శకాలు అమలు, దూర ప్రాంతాల్లోని బోధనాసుపత్రుల్లో ఖాళీలు భర్తీ కాని పక్షంలోనే నాన్-క్లినికల్ పోస్టులను ఎంఎస్సీ పీహెచ్‌డీ అర్హతతో కలిగిన వారిని నియమించాల్సి వస్తోందన్నారు. ఈ అంశంపైనా కూడా ఆందోళన చెందాల్సిన అవసరంలేదని తెలిపారు. ఇదే సమయంలో 15 శాతం స్టైఫండ్ పెంచలేమని, పునరాలోచన చేయాలని వారికి మంత్రి తెలియజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు స్థాయిలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఇంటర్న్ (హౌస్ సర్జన్ల)కు ఈ ఒక్క ఏడాదికి 5% పెంచి, వచ్చే ఏడాది నుంచి 3% చొప్పున పెంచుతామని మంత్రి వారికి తెలియచేశారు. పీజీ, సూపర్ స్పెషాల్టీ పీజీలకు ఏటా 3% పెంచుతామని వెల్లడించారు. జూడా ప్రతినిధులతో మరోమారు చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని మంత్రి వారికి తెలియచేశారు. రోగులకు అందించే వైద్య సేవల్లో ఎటువంటి లోపం రాకుండా చూడాలని వారికి హితవు పలికారు.

# ఆర్టీఈ అడ్మిషన్లు పెరిగాయి!

(మొదటి పేజీ తరువాయి)

2022-23 ఏడాదిలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో కేవలం 2,203 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదే 2024-25లో సుమారు 29వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. 2026-27 ఏడాదిలో 28,742 మంది విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు లభించాయి. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యాహక్కు చట్టంపై సమాజంలో అవగాహన పెరిగిందని, దీనిపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

**మండలిలో 5 బిల్లులు.. ఏకగ్రీవ ఆమోదం!**

శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 5 కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మంత్రి ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు, ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల(ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లు, ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లులను మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.

# తరగతి గదిలో విషాదం!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

**టిల్ గార్డెన్ స్కూల్ ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీ :** నగరంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో మైనర్ విద్యార్థి మృతి చెందిన ఘటనపై పాఠశాల విద్యాశాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఘటనను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపింది. ఘటన జరిగిన వెంటనే సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి ప్రాథమిక నివేదిక సమర్పించగా, వాస్తవాలను సమగ్రంగా పరిశీలించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

కమిటీలో విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ), జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీఓ) సభ్యులుగా ఉంటారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు సున్నితంగా, బాధ్యతాయుతంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించేలా అవసరమైన సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొంది. ముగ్గురు సభ్యుల కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# జిల్లా కలెక్టరేట్లకు కొత్త రూపు!

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ భీమవరం కలెక్టరేట్ నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ పీపీపీ విధానం-2026 మార్గదర్శకాల మేరకు ప్రతిపాదన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని, తగిన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇతర జిల్లాలకు సంబంధించి వచ్చిన ప్రతిపాదనలపై ఆర్అండ్‌బీ శాఖ ఇప్పటికే డిజైన్లు సిద్ధం చేసిందని, ఆయా డిజైన్లను పరిశీలించిన అనంతరం కలెక్టరేట్ల నిర్మాణంపై ప్రభుత్వం త్వరలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ సవరణ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ (సవరణ) బిల్లు-2026కు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించిన సమస్యను పరిష్కరించే దిశగా ఈ సవరణ బిల్లు తీసుకొచ్చారు.

ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చట్టం-2023 పరిధిలో సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌ను చేర్చేందుకు ప్రభుత్వం ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. చట్టపరమైన కాలక్రమ వ్యత్యాసం కారణంగా సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న సుమారు 157 మంది అర్హతగల కాంట్రాక్టు ఉద్యోగులకు సర్వీసు క్రమబద్ధీకరణ అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు చట్టంలోని అనుసూచిని సవరించే బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు!

(మొదటి పేజీ తరువాయి)



అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31 శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30--35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్ లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు.

**విభజన హామీల పరిష్కారం :** ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను చంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తికాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్--13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్ కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి భద్రతకు గోదావరి--కావేరి అనుసంధానం :** భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సీఎం కేంద్రం ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతాలకు తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర--రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కౌన్సిల్ లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సీఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అరణ్యానికి సాంకేతిక రక్షణ కవచం!

(మొదటి పేజీ తరువాయి)




జీఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తదితర వ్యవస్థలపై అధ్యయనం చేసి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను పవన్ కళ్యాణ్‌కు అందజేశారు.

తమ పరిశీలనలు, కర్ణాటకలో విజయవంతంగా అమలవుతున్న విధానాలపై బృందం పలు సూచనలు చేసింది. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్.. కర్ణాటకలో సత్ఫలితాలు ఇచ్చిన పలు విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

**అడవులపై సమగ్ర డిజిటల్ నిఘా :** అడవిలో ప్రతి అణువును కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించే విధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పట్ల పవన్ కళ్యాణ్ ఆసక్తి కనబరిచారు. జియో-స్పేషియల్ డ్యాష్‌బోర్డ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్యపై ఎప్పటికప్పుడు విశ్లేషణ, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**సిబ్బందిలో జవాబుదారీతనం పెంచేలా :** కర్ణాటక అమలు చేస్తున్న ఈ-గస్తు మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా అద్భుత ఫలితాలు సాధించవచ్చని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పర్యవేక్షణ, వారి భద్రతా చర్యల్లో ఈ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు.

గస్తీ, హాజరు, నిరంతర మార్గ నిర్దేశం, నివేదికల సమర్పణకు ఈ-గస్తు సమర్థవంతమైన సాధనంగా పనిచేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖలో ఇప్పటికే అమలులో ఉన్న ఫారెస్ట్ పోర్టల్, సింగిల్ సైన్-ఆన్ వ్యవస్థలను అనుసంధానించి ఈ-గస్తు మొబైల్ యాప్ రూపొందించాలని సూచించారు. దీనివల్ల క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరులో జవాబుదారీతనం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

**త్వరితంగా పరిహారం అందించేలా :** వన్యప్రాణుల వల్ల అటవీ సరిహద్దు గ్రామాల్లో జరిగే పంట నష్టానికి పరిహారం చెల్లించే ప్రక్రియను కూడా డిజిటలీకరణ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. పంట నష్టంపై నివేదికలు రూపొందించడం, రైతులకు పరిహారం చెల్లింపుల వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావడంతోపాటు వేగంగా పరిహారం అందించే వెసులుబాటు కల్పించాలన్నారు.

జీఐఎస్ ఆధారిత ధృవీకరణ వ్యవస్థను తక్షణం అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనివల్ల పంట నష్టం, నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించడంతోపాటు పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

**అటవీ సరిహద్దులకు చట్టబద్ధమైన భద్రత :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గనిర్దేశకత్వంలో, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నాయకత్వంలో ఇప్పటికే అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రంలో కూడా చేపట్టిన విషయాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. తద్వారా అటవీ సరిహద్దుల చట్టబద్ధతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.


దీనితో పాటు హనుమాన్ ద్వారా ఇప్పటికే మానవ-వన్యప్రాణుల ఘర్షణల నివారణ, విశ్లేషణ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన డ్యాష్‌బోర్డులు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు.

**కర్ణాటకతో పరస్పర సాంకేతిక సహకారం :** కర్ణాటక అటవీ శాఖతో ఇప్పటికే ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి పలు అంశాల్లో ఒప్పందాలు చేసుకున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇకపై ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయనున్నట్లు వివరించారు.

ఇందులో భాగంగా ఇరు రాష్ట్రాల అటవీ శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సాంకేతిక వర్క్‌షాప్‌లు నిర్వహించడం, పత్రాల మార్పిడి, అవసరమైన చోట సోర్స్ కోడ్ భాగస్వామ్యం, జీఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించిన వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా అటవీ భూముల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సిబ్బంది పనితీరు పర్యవేక్షణ, అగ్నిప్రమాదాల నియంత్రణ, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణతోపాటు అటవీ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## రైతుల ఖాతాల్లో
# రూ.14,664.33 కోట్లు



- **అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం**
- **వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్):** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలోని దాదాపు 47 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.14,664.33 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.8,903.10 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.5,761.23 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం అమలు చేస్తున్న ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా ఇప్పటివరకు 15.69 లక్షల మంది రైతులకు ఎరువులు అందించామని, 3,20,880 మంది కౌలు రైతులకు కూడా ఎరువులు అందించినట్లు చెప్పారు.

రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందించేందుకు ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం పనిచేస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. అక్టోబర్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 9.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఇందులో 3.69 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 89 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఎరువుల పంపిణీలో ఏర్పడిన ఇబ్బందులకు అడ్డుకట్ట వేసేందుకు ఏపీ ఏఐఎంఎస్ 2.0ను తీసుకొచ్చామని, వాస్తవ సాగుదారు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట రకం ఆధారంగా శాస్త్రీయంగా ఎరువుల అవసరాన్ని నిర్ణయించి సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడే పరిస్థితిని తొలగించామని చెప్పారు.

పంటల ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేందుకు గడిచిన రెండేళ్లలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా దాదాపు రూ.800 కోట్ల మేర ప్రభుత్వం సాయం అందించిందని మంత్రి తెలిపారు. పొగాకు, ఉల్లి, మామిడి, కోకో, టమోటా, చీని తదితర పంటల రైతులకు అండగా నిలిచామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి చెల్లించాల్సిన సుమారు రూ.1,900 కోట్ల పంటల బీమా వాటాను చెల్లించకుండా రైతులను నష్టపరిచిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు బీమా రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని, ఈ ఏడాది బీమా నమోదుకు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు వెల్లడించారు. ఉచిత భూసార పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, ట్రాక్టర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయంగా నియంత్రిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం ద్వారా అధికారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమంపై వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే శాసనసభకు వచ్చి గత ఐదేళ్ల పాలనలో రైతులకు ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. పెట్టుబడి సాయం నుంచి పంటల బీమా వరకు, విత్తనం నుంచి ఎరువు వరకు, భూసార పరీక్షల నుంచి యాంత్రీకరణ వరకు, పంట ఉత్పత్తి నుంచి గిట్టుబాటు ధర వరకు రైతుకు ప్రతి దశలో అండగా

# పట్టణ మౌలిక వసతులకు భారీ ఊతం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళిక దశల్లో ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది.

రాష్ట్రంలోని పట్టణాల్లో మౌలిక వసతుల లోటును గుర్తించి వాటిని దశలవారీగా భర్తీ చేసేందుకు గ్యాప్ అసెస్‌మెంట్ రిపోర్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు రూపొందించారు. 123 యూఎల్‌బీల్లో 724 ఎంఎల్‌డీ నీటి శుద్ధి సామర్థ్యం, 9,608 కిలోమీటర్ల నీటి పంపిణీ నెట్‌వర్క్, 1,443 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి సామర్థ్యం, 19,081 కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ, 23,612 కిలోమీటర్ల వర్షపు నీటి కాలువలు, 4,388 కిలోమీటర్ల పట్టణ రహదారుల లోటును గుర్తించారు. ప్రస్తుతం 75 నీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా 1,083 ఎంఎల్‌డీ సామర్థ్యం, 7,148 కిలోమీటర్ల నీటి పంపిణీ నెట్‌వర్క్, 8.74 లక్షల గృహ నీటి కనెక్షన్లు, అదనంగా 1,263 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి సామర్థ్యం కల్పించే పనులు కొనసాగుతున్నాయి.

హెచ్ఏఎం కింద మంజూరైన రూ.5,500 కోట్ల మూలధన వ్యయంలో రూ.4,655.82 కోట్లు రోడ్లు, డ్రైన్లకు, రూ.509.12 కోట్లు పార్కులకు, రూ.247.28 కోట్లు వీధి దీపాలకు, రూ.87.78 కోట్లు సెంట్రల్ మీడియన్లకు కేటాయించారు. రాష్ట్రంలో గుర్తించిన 25,626 కిలోమీటర్ల పట్టణ రహదారుల్లో ఇప్పటికే 21,238 కిలోమీటర్లు, అంటే 82.9 శాతం అభివృద్ధి చెందగా, మిగిలిన 4,388 కిలోమీటర్లను హెచ్ఏఎం కింద చేపట్టనున్నారు. ఇందుకు 4,388 కిలోమీటర్ల రోడ్లు, 541 పార్కులు, 20,340 వీధి దీపాలు, 1,186.56 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లకు సంబంధించిన డీపీఆర్ పనులు పూర్తయ్యాయి. మూలధన వ్యయంలో 40 శాతం అంటే రూ.2,200 కోట్లు ఎల్ఆర్ఎస్/బీపీఎస్ నిధుల ద్వారా ముందస్తుగా సమకూర్చనుండగా, మిగిలిన 60 శాతం రూ.3,300 కోట్లను రాయితీదారు సమకూర్చనున్నారు. ఈ మొత్తాన్ని పదేళ్లలో 40 త్రైమాసిక వాయిదాల్లో చెల్లించనున్నారు. నిర్మాణం అనంతరం పదేళ్లపాటు నిర్వహణ, మరమ్మతుల బాధ్యత కూడా రాయితీదారుదే.

స్వర్ణ ఆంధ్ర-2047 లక్ష్యానికి అనుగుణంగా పట్టణాలను ప్రణాళికాబద్ధంగా, నివాసయోగ్యంగా, పెట్టుబడులకు అనుకూలంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గత రెండేళ్లలో 123 యూఎల్‌బీల్లో 58 కొత్త పార్కులను అభివృద్ధి చేసి, 110 పార్కులను ఆధునీకరించగా, మరో 45 పార్కుల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా 2,165 కిలోమీటర్ల పట్టణ రహదారుల వెంట 4.43 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా 108 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు పనుల ఉత్తర్వులు ఇచ్చామని, వీటి మొత్తం సామర్థ్యం రోజుకు 5,385 టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు. కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరులో నాలుగు వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనులు కొనసాగుతున్నాయని, విజయవాడ, తిరుపతిలో టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. అమరావతిలో రూ.66,802.20 కోట్ల విలువైన 117 మౌలిక వసతుల పనులకు అనుమతులు మంజూరు కాగా, 95 పనులు రూ.43,422.80 కోట్ల వ్యయంతో అమలులో ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. స్వర్ణ ఆంధ్ర-2047లో భాగంగా మెరుగైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, పచ్చదనం, ప్రజా సౌకర్యాలతో భవిష్యత్ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా రాష్ట్ర పట్టణాలను తీర్చిదిద్దడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

# సభ సజావుగా.. సమావేశాలు ముగిసేలా!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల ముగింపు సందర్భంగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభా కార్యకలాపాల గణాంకాలను వెల్లడించారు. నాలుగు రోజుల్లో మొత్తం 25 గంటల 15 నిమిషాల పాటు సభ నిర్వహణ జరిగిందని తెలిపారు. 40 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు మౌఖికంగా సమాధానాలు ఇచ్చామని, మరో 25 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు, ఒక నక్షత్ర గుర్తులేని ప్రశ్నకు సమాధానాలను సభ ముందుంచినట్లు వివరించారు. సమావేశాల్లో 12 బిల్లులు ప్రవేశపెట్టగా అన్నీ ఏకగ్రీవంగా ఆమోదం పొందాయని, ఒక బిల్లు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. మూడు లఘు చర్చలు జరిగాయని, 344వ నిబంధన కింద రెండు అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రి ప్రకటనలు చేశారని వెల్లడించారు. ఒక ప్రభుత్వ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందగా, ఒక కమిటీ నివేదికను సభకు సమర్పించి ఆమోదించినట్లు చెప్పారు. వివిధ అంశాలపై మొత్తం 103 మంది సభ్యులు ప్రసంగించారని తెలిపారు.

రాజకీయ పార్టీల బలాబలాలను కూడా స్పీకర్ వివరించారు. శాసనసభలో తెలుగుదేశం పార్టీకి 135 మంది, జనసేన పార్టీకి 21 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది, భారతీయ జనతా పార్టీకి 8 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు.



అనంతరం 16వ శాసనసభ ఏడో సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

# ఏపీపీఎస్సీ.. డీఎస్సీ ఒకటేనా?



- జగన్‌కు పరీక్షల వ్యవస్థపై అవగాహన లేదంటూ లోకేష్ ధ్వజం
- డీఎస్సీ నిర్వహించలేకపోయారు.. ఇప్పుడు చర్చకు వెనుకడుగు
- రెండింటి మధ్య తేడా, విధివిధానాలు వివరిస్తాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అంటే ఏమిటో, డీఎస్సీ అంటే ఏమిటో కూడా తెలియని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాటిని రెండూ ఒకటేనని భావిస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే వివిధ పరీక్షలు, వాటి విధివిధానాలపై కనీస అవగాహన కూడా లేని జగన్ తన పాలనా కాలంలో ఒక్క డీఎస్సీ పరీక్షను కూడా నిర్వహించలేకపోయారని ఆరోపించారు.
ఉద్యోగ నియామకాలు, పరీక్షల నిర్వహణపై అవగాహన లేని జగన్ ఇప్పుడు శాసనసభలో చర్చ నుంచి పారిపోతున్నారని నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య ఉన్న తేడా, వాటి విధివిధానాలపై వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీగా డీఎంఈకు అదనపు బాధ్యతలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ ఆస్ట్రియాలోని వియన్నాలో ఆగస్టు 22 నుంచి 26 వరకు జరగనున్న అంతర్జాతీయ ఆరోగ్య వృత్తుల విద్యా సంఘం (ఏఎంఈఈ) సదస్సు--2026కు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆగస్టు 20 నుంచి 28 వరకు హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.
వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవికి ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) ఏ.విష్ణు వర్ధన్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రూ.11,285 కోట్లతో 51.56 లక్షల కాపులకు లబ్ధి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో కాపు కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల కింద రూ.11,285.72 కోట్లతో 51,56,172 మంది కాపులకు లబ్ధి చేకూర్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం శాసనమండలిలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజిక వర్గానికి ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయించింది, ఎంతమంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కాపు కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించామని, కాపుల అభివృద్ధికి ఏటా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. బడ్జెట్ వారీగా వివరాలను వెల్లడిస్తూ 2024-25లో రూ.4,646.99 కోట్లు కేటాయించగా రూ.4,440.25 కోట్లు వెచ్చించి 9,55,144 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చామన్నారు. 2025-26లో రూ.4,924.28 కోట్లు కేటాయించగా రూ.4,360.28 కోట్లతో 20,63,907 మందికి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. 2026-27లో రూ.5,012.10 కోట్లు కేటాయించగా, నేటి వరకు రూ.2,485.19 కోట్లతో 21,37,121 మంది కాపులకు ప్రయోజనం చేకూర్చామని మంత్రి సవిత తెలిపారు.

## పేద విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో గుంటూరు జిల్లా తాడికొండలోని ఐఐటి నీట్ ఎక్సలెన్సీ సెంటర్ లో అదనపు భవనాల నిర్మాణం, విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్ క్యాంపస్ నిర్మాణ నమూనాను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... క్యాంపస్ లో అదనపు భవనాల నిర్మాణం, అంతర్గత రోడ్లతోపాటు వాకింగ్ ట్రాక్,బ్యాట్మెంటన్ కోర్టు, కోకో కోర్టు, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా నిర్మాణాలు, ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని మంత్రి తెలిపారు. ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్ల ద్వారా పేద విద్యార్థులకు బంగారు భవితను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు. ఈ సమీక్షలో APSWREIS కార్యదర్శి IAS వి.ప్రసన్న వెంకటేష్, APEWIDC EE అనిల్ కుమార్, గుంటూరు జిల్లా ఎస్సి కార్పొరేషన్ ఈడీ దుర్గా బాయి, APSWREIS డీసీవో తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర భద్రతకు పక్కా రికార్డు

- ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ: సీఎం చంద్రబాబు
- గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం విస్తృత గాలింపు
- 216 నాటికల్ మైళ్ల పరిధిలో నేవీ విమానాలతో అన్వేషణ
- కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం
- ఘటన తర్వాత స్పందించడం కాదు.. ముందే అప్రమత్తం కావాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: సముద్రంలో మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తర్వాత స్పందించడం కాకుండా... ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించేలా ఎస్ఓపీ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, వేటకు వెళ్లే వారి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటేనే అత్యవసర సమయాల్లో సత్వర సాయం అందించగలమని స్పష్టం చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటనపై గురువారం కూడా క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు:** ఈ నెల 3వ తేదీన ఏడుగురు మత్స్యకారులు బోటులో వేటకు వెళ్లారని, పది రోజుల తర్వాత తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నెల 16న మత్స్యకారుల ఆచూకీ లభించడం లేదని కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. బోటులో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు, బోటు ఒంటరిగా ఎందుకు సముద్రంలోకి వెళ్లింది? బోటు గల్లంతైన విషయం అధికారులకు ఎప్పుడు తెలిసింది? తెలిసిన వెంటనే గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు? అనే అంశాలపై సీఎం అధికారులను ప్రశ్నించారు. గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే చెన్నైలోని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌తో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ఏపీకి చెందిన బోటు గల్లంతైన విషయాన్ని అండమాన్ సహా బంగ్లాదేశ్ కు కూడా చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారుల ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. నేవీ డార్నియర్ విమానాల ద్వారా 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు నిర్వహించినట్లు సీఎంకు వివరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు అందుతున్న సాంకేతిక సహాయం, రోజువారీ సమన్వయ వ్యవస్థలపైనా చంద్రబాబు సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మత్స్యకారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు :మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలపై గత రెండు, మూడు రోజులుగా వాట్సాప్ గ్రూపులు, పత్రికల్లో వస్తున్న కథనాలపై స్పందించిన మంత్రి అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే రాత్రి సమయంలో ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, జనరల్ వార్డులను స్వయంగా పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, మందుల నాణ్యత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వేళల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.
కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే స్థోమత లేని పేద ప్రజలే ప్రభుత్వాసుపత్రులను ఆశ్రయిస్తారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య యంత్రాంగంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఆసుపత్రిలో తప్పనిసరిగా ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవలపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతతో పనిచేయలేని వారు విధుల నుంచి తప్పుకోవచ్చని స్పష్టం చేశారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కందుల దుర్గేష్ తెలిపారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి రాత్రి వేళలోనూ ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రి చొరవపై స్థానిక ప్రజలు, రోగులు హర్షం వ్యక్తం చేశారు.

## పంటల బీమా విషయంలో రైతులు త్వరపడాలి

- బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి రైతు బీమా రక్షణ పొందాలి
- రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటా స్వల్పమే
- ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలి
- అసెంబ్లీ వేదికగా రైతులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు



**అమరావతి, ఆగస్ట్ 20(జర్నలిస్ట్ ఫైల్)**: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమా విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో అంచనా వేయలేమని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

**రైతుపై ప్రీమియం భారం చాలా స్వల్పమే** : పంటల బీమా కోసం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా చాలా తక్కువగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రాంతం, పంటను బట్టి రైతు వాటా మారుతుందని, కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన మొత్తం అత్యంత స్వల్పంగా ఉందన్నారు. మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని వివరించారు. స్వల్ప మొత్తాన్ని చెల్లించడం ద్వారా పంట నష్టం సంభవించినప్పుడు బీమా రక్షణ పొందే అవకాశం ఉన్నందున రైతులు దీనిని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

**ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి** : పంటల బీమా నమోదును కేవలం వ్యవసాయ శాఖ కార్యక్రమంగా చూడకుండా ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులందరూ బీమా నమోదు చేసుకునేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమాను తేలికగా తీసుకోవద్దు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలి. స్వల్ప ప్రీమియంతో లభించే బీమా రక్షణను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

## జూనియర్ వైద్యుల ఆందోళన ఉధృతం

- 11వ రోజుకు చేరిన రాష్ట్రవ్యాప్త సమ్మె
- నాలుగో రోజుకు చేరిన మూడో దశ ఆందోళన
- 125 మంది ఇంటర్న్‌లు, రెసిడెంట్ వైద్యుల రక్తదానం
- 15 మంది పీజీ వైద్యుల రిలే నిరాహార దీక్ష
- పాటల ద్వారా తమ సమస్యలను వినూత్నంగా వ్యక్తం చేసిన జూనియర్ వైద్యులు





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె 11వ రోజుకు, మూడో దశ ఆందోళన నాలుగో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన జూనియర్ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు. ఇంటర్న్‌లు, పీజీ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
నిరసనలో భాగంగా సుమారు 125 మంది ఇంటర్న్‌లు, రెసిడెంట్ వైద్యులు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో పాల్గొనగా, 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆందోళన కొనసాగుతున్నప్పటికీ ప్రజారోగ్యం, సేవ పట్ల తమ నిబద్ధతను చాటిచెప్పారు. ఐఎంఏ-జేడీఎన్ రాష్ట్ర కన్వీనర్ డా. కార్తిక్ ఆరే నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ వైద్యుల డిమాండ్లకు సంఘీభావం తెలిపారు.

**జీడీఏ గుంటూరు మద్దతు**: జీడీఏ గుంటూరు ప్రతినిధులు కూడా నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ వైద్యులకు మద్దతు ప్రకటించారు. జీడీఏ గుంటూరు అధ్యక్షుడు డా. దేవకుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డా. స్వరూప్ కాంత్, ఆర్థోపెడిక్స్ విభాగం ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డా. పి. అనిల్ బాబు, ట్రెజరర్ డా. కవిత, జాయింట్ సెక్రటరీ డా. రవీంద్ర కుమార్, డా. శివ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్లకు వినతిపత్రాలు**: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన జూడా ప్రతినిధులు తమ తమ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. జూడా లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. అర్థవంతమైన చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపి, పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

**పాటలతో నిరసన**: అనంతరం ఇంటర్న్‌షిప్, పీజీ శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, సమస్యలను ప్రతిబింబించే పాటల ద్వారా జూనియర్ వైద్యులు తమ నిరసనను, ఆవేదనను సృజనాత్మకంగా వ్యక్తం చేశారు. న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారం లభించే వరకు శాంతియుత ప్రజాస్వామ్య నిరసన, ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలు కొనసాగిస్తామని ఏపీ జూడా స్పష్టం చేసింది.

## మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో రూ.కోటితో బీసీ కమ్యూనిటీ హాల్



**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్)** : మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సుమారు రూ.కోటి వ్యయంతో తాడేపల్లి 6వ వార్డు సలాం సెంటర్‌లో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ వర్గాల సంక్షేమం, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.
మంత్రి నారా లోకేష్ చొరవతో త్వరలో తాడేపల్లి ప్రాంతంలో రూ.5 కోట్ల వ్యయంతో బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటు చేయనున్నట్లు సత్యనారాయణ, వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే రూ.500 కోట్లతో తాడేపల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు సుమారు రూ.200 కోట్ల మేర అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## 22 నుంచి ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావుతో కలిసి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు (బిఎల్ఓ), రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని వివేక్ యాదవ్ ఆదేశించారు. ఓటరు జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన మార్గదర్శకాల్లో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి అందే అభ్యంతరాలు, దరఖాస్తులపై విచారణను వేగవంతం చేయాలని తెలిపారు. విచారణ సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు సమర్పించే పత్రాలను వెంటనే సంబంధిత దరఖాస్తులో నమోదు చేయాలని ఆదేశించారు. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసుల పంపిణీ, దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడే సేవకు సంబంధించిన పెండింగ్ అంశాలపైనా సమావేశంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు సిఇఒ ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్)** : బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఈవో రవిచంద్ర అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆలయ మాడవీధులను తనిఖీలు చేశారు. ఈ ఏడాది అధిక మాసం కారణంగా సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండింటిని టీటీడీ నిర్వహించనుందని అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై చర్చించామని చెప్పారు.
సెప్టెంబర్ 15 - సెప్టెంబర్ 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 - అక్టోబర్? 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 14న సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 - 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనున్నారు. ఈ సందర్భగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెంకయ్య చౌదరి తెలిపారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



**ఆత్మకూరు (ఎం) ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు(ఎం) మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు యాస సుభాష్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగంలో పనిచేస్తున్న వారి సేవలను గుర్తుచేసుకుంటూ, వృత్తిపరమైన ఐక్యతతో ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్‌గౌడ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎలగందుల మహేష్, జిల్లా కార్యదర్శి గజరాజు కాశీనాథ్, వార్డు సభ్యుడు బూడిద శేఖర్, రంగ పరుశురాం, వంగరి మహర్షి, కోల నరేష్, చిత్తర్ల అనిల్, వేముల నవీన్, కోల సాయిఅఖిల్, కటేకోల ప్రవీణ్, కటేకోల పవన్, ఉగ్గె ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు..

- ఘనంగా ఫోటోగ్రఫీ డే జెండా ఆవిష్కరణ.
- ఫోటోగ్రఫీ పితామహుడు డాగురేకు నివాళులర్పించిన జిల్లా మండల పట్టణ సభ్యులు.



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఫోటోగ్రఫీ 187వ డే నీ పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాటూరి నరసింహ అధ్యక్షతనలో బాబాసాహెబ్ అంబేద్కర్ , ఫోటోగ్రఫీ పితామహుడు డాగురేకి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఫోటో గ్రఫీ జెండాను ఎగురవేసిన అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తిని పించు కుంటూ ఫోటోగ్రఫీ డే శుభాకాంక్షలు తెలియ జేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ కూడా ఆధునిక టెక్నాలజీ ఏఐని అంది పుచ్చుకొని ఫోటో గ్రఫీ రంగంలో మరింత అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి కోయా నర్సింగ్ రావు , కోశాధికారి నాగు నరేష్ , జిల్లా సభ్యులు కేస దశరథ , కుచ్చుల ఐలయ్య , జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి దిడ్డికాడి రాము , ఉపాధ్యక్షులు పాశం ప్రవీణ్ , అన్నగంటి రాజు , బోజ్జా మధు , మాజీ పట్టణ అధ్యక్షులు రావుల నాగరాజు , కొత్త నగేష్ సభ్యులు , అంజలి స్టూడియో జోగు సతీష్ , ధరం పాల్ , విక్రమ్ , రావుల శ్రీనివాస్ , మహేష్ , నరేష్ , వీరన్న , చిన్న , రాజు , గణేష్ , మనోజ్ , బాలరాజు, సాయి , నరసింహ , వెంకట నరసింహ , అనిల్ , రవికృష్ణ , మంద ఉపేందర్ , బొబ్బిలి రాజు , బెలిదే రాజు , రవి , చినరాజు , శ్రీకాంత్ , మురళి , దేవా , మద్ది ప్రసాద్ , పెంట బాలరాజు ఉపేందర్, కటకం భాను , మండల , పట్టణ ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## సాగర్ నీటి విడుదలకై కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రంగారెడ్డి



**మిర్యాలగూడ, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** కృష్ణానది ఎగువ ప్రాంతాలలో ఉన్న ప్రాజెక్టులలో నీరు వచ్చి చేరుతున్నాయని ఆ క్రమంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలకై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం వ త్తిడి తేవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామ పరిధిలోని గద్దగూడతండాలో జాతీయ రైతు సంఘం మహాసభల గురించి రైతులకు వివరించారు. జాతీయ మహాసభ జయప్రదానికి రైతులు స్వచ్ఛందంగా స్పందించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు నీటిని విడుదల చేసే ప్రయత్నాలు చేయాలని చెరువులు కుంటలు నింపి భూ గర్భ జలాలు పెరిగేటట్లుగా చూడాలని రైతులు రంగారెడ్డిని కోరారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఆల్మట్టి, జూరాల, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండినాయని ఇంకా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలుపుతున్నందువల్ల నీరు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కేంద్ర జల సంఘంలో ప్రభుత్వానికి రావాల్సిన నీటి వాటాను రాబట్టేందుకు ప్రయత్నించాలని ఆయన సూచించారు. ఆయకట్టు ప్రాంతంలో బోర్ల కింద భావుల కింద వరి సేద్యం జరుగుతుందని ఈ క్రమంలో చెరువుల్లోని నీరు తగ్గి భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి ఉందని ఆయన వివరించారు. అందుకే సాగర్ ఎడమ కాల్వ నీటితో చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని అధికారులు ఆ మేరకు సూచనలు చేయాలని ఆయన కోరారు. ఎల్ నీనో ప్రభావం వచ్చే సంవత్సరం కూడా ఉంటుందని అందుకే సాగుకు నీటిని విడుదల చేయకుండా మంచినీటి కొరకు వినియోగిస్తామని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలిసిందన్నారు. నీటి కోసం రాబోయే రోజుల్లో జరిగే ఉద్యమాలకు రైతులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలో నల్లగొండ పట్టణంలో జరిగే జాతీయ రైతు మహాసభలకు రైతులు సహకరించాలన్నారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్ గ్రామస్తులు ఉన్నారు.

## నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన



**మిర్యాలగూడ, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి, కిష్టపురం గ్రామాల్లో ఆత్మ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, సమీకృత తెగులు నిర్వహణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీ ఎం. రుషేంద్రమని మాట్లాడుతూ నానో ఎరువుల వినియోగ విధానం, ప్రయోజనాలు, సమీకృత తెగులు నిర్వహణ పద్ధతులపై రైతులకు వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ ద్రవరూపంలో లభించే ఆధునిక నానో ఎరువులని, పంట అవసరాన్ని బట్టి సిఫారసు చేసిన మోతాదులో నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలను అందించవచ్చని అధికారులు తెలిపారు. పంట ఎదుగుదల దశతో పాటు పూత, పిందె దశల్లో ఆకుల పైభాగం, క్రింది భాగం తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. వీటి వినియోగంతో పోషకాల సమర్ధ వినియోగం, ఎరువుల రవాణా, నిల్వలో సౌలభ్యం కలుగుతుందని వివరించారు. అలాగే సమీకృత తెగులు నిర్వహణలో భాగంగా రసాయన పురుగుమందులపై పూర్తిగా ఆధారపడకుండా జీవ, యాంత్రిక తదితర పద్ధతులను సమన్వయం చేసుకుని తెగుళ్లను నియంత్రించవచ్చని తెలిపారు. దీని ద్వారా పురుగుమందుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ సాధ్యమవుతుందని, పురుగుమందుల నిరోధకత ఏర్పడకుండా నివారించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి పార్వతి, బీటీఎం గిరి, రవి, నాగరాజు, కృష్ణారెడ్డి, లింగనాయక్, రవి, రంగారెడ్డి తదితరులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

# ఆలేరులో తెలంగాణ అమరవీరుల స్థూపానికి శంకుస్థాపన

- అమరవీరుల త్యాగాలకు చిరస్థాయి గుర్తింపుగా నిర్మాణం
- అండర్‌పాస్ చౌరస్తాకు 'తెలంగాణ అమరవీరుల చౌరస్తా'గా నామకరణం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను శాశ్వతంగా భావితరాలకు చాటిచెప్పే లక్ష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన ఆయన, వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని గుర్తు చేశారు. వారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని, ఆ మహనీయుల సేవలను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. అమరవీరుల ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు చేరేలా ఇలాంటి స్మారక చిహ్నాల నిర్మాణం ఎంతో అవసరమని తెలిపారు.ఆలేరు పట్టణంలోని అండర్‌పాస్ చౌరస్తాను "తెలంగాణ అమరవీరుల చౌరస్తా"గా నామకరణం చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిర్మించనున్న అమరవీరుల స్థూపం తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రతిబింబించేలా, ఆలేరు పట్టణానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చేలా రూపుదిద్దు కుంటుందని చెప్పారు. ఇది కేవలం ఒక స్మారక చిహ్నం మాత్రమే కాకుండా, తెలంగాణ కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలకు నిత్య స్మరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

స్థూప నిర్మాణానికి అవసరమైన నిధులను బీర్ల ఫౌండేషన్ ద్వారా సమకూర్చనున్నట్లు వెల్లడించిన ఎమ్మెల్యే, అత్యుత్తమ నాణ్యతతో, ఆధునిక హంగులతో నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ స్థూపం ప్రజల్లో దేశభక్తి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంపొందించే కేంద్రంగా నిలుస్తుందని అన్నారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, వ్యక్తిగతంగా కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని, తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అమరవీరుల ఆశయాల సాధనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

# పాఠాలు చెప్పిన టీచర్‌నే హతమార్చిన విద్యార్థులు.!

- 'బాబు' అనే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ..
- ఇద్దరు పదో తరగతి విద్యార్థుల అరెస్ట్.




**నల్గొండ జిల్లా ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. దోపిడీ కోసం ప్రణాళిక రచించి ప్రిన్సిపల్‌ను హత్య చేసిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**'బాబు' అనే ఒక్క మాటతో కీలక ఆధారం**

హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతూ చివరిగా "బాబు" అని పలకడం పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. విద్యార్థులను ఆమె సాధారణంగా "బాబు" అని పిలిచే విషయాన్ని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు.

**30 కి.మీ. పరిధిలో 70 సీసీ కెమెరాల పరిశీలన**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాలతో దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, 80 మందికి పైగా అనుమానితులను విచారించారు. 30 కిలోమీటర్ల పరిధిలోని సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషించారు.

**జల్సాల కోసం దోపిడీకి పథకం**

ఇద్దరు విద్యార్థులు ఒకే హాస్టల్ గదిలో ఉంటూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లో సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను వెతికినట్లు పోలీసులు తెలిపారు. గతంలో హాస్టల్‌లో డబ్బులతో పట్టుబడినప్పుడు ప్రిన్సిపల్ తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో ఆమె పై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**వారంరోజులుగా రెక్కీ.. పక్కా ప్లాన్‌తో హత్య**

ప్రిన్సిపల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన విద్యార్థులు ముందుగా రెక్కీ నిర్వహించారు. అనంతరం కత్తి, గ్లౌజులు కొనుగోలు చేసి, మాస్కులు ధరించి ఇంట్లోకి ప్రవేశించారు. వంటగది ద్వారా లోపలికి వెళ్లి కత్తితో రూపారెడ్డిపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.




**రూ.2.50 లక్షల నగదు అపహరణ**

హత్య అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న రూ.2.50 లక్షల నగదును అపహరించి, ఇంటి వెనుక గోడ దూకి పరారయ్యారు. కత్తి, గ్లౌజులు, మాస్క్ సెల్‌ఫోన్ తదితరాలను చెట్ల పొదల్లో పడేసి, బట్టలు మార్చుకుని హుడీని డ్రైనేజీలో వేసినట్లు పోలీసులు తెలిపారు.

**రూ.1.54 లక్షల నగదు స్వాధీనం**

పోలీసులు ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద రూ.1.54 లక్షల నగదు గుర్తించారు. అందులోని మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విచారణలో ప్రిన్సిపల్ హత్యకు పాల్పడి నగదు అపహరించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**స్వాధీనం చేసుకున్నవి**

రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**చట్టంతో సంఘర్షణ పడిన బాలురు**

JCL-1, వయస్సు 16 సంవత్సరాలు, నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ పదో తరగతి విద్యార్థి.
JCL-2, వయస్సు 16 సంవత్సరాలు, నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ పదో తరగతి విద్యార్థి.

**పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు**

ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ వీ.ఎ. శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ A. నవీన్ కుమార్, జజూ ఇన్‌స్పెక్టర్ వీ. జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ A. రమేష్, చింతపల్లి ఎస్ఐ వీ. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ D. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ N. వెంకన్న, CCS ఎస్ఐ U. సురేష్తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

**శాస్త్రీయ దర్యాప్తుతో నేరం ఛేదించాం**

ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ..ప్రతి చిన్న ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసు బృందాల కృషి అభినందనీయమని అన్నారు. నేరస్తులు ఎంత తెలివిగా వ్యవహరించినా శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే నేరాన్ని ఛేదించవచ్చని తెలిపారు.

# భూ నిర్వాసితులకు రూ.206 కోట్ల నిధులు విడుదల..

- హర్షం వ్యక్తం చేసిన బి.ఎన్ తిమ్మాపురం గ్రామస్తులు
- సీఎం-ఉత్తమ్-కుంభంకు పాలాభిషేకం చేసిన గ్రామస్తులు
- ఎమ్మెల్యేతో కలిసి భూ నిర్వాసితుల ర్యాలీ





**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు బుధవారం రోజు సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్అండ్ఆర్ , భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం ఎమ్మెల్యేతో కలిసి గ్రామస్థులు ర్యాలీగా వెళ్లి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులు , నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో ఆర్అండ్ఆర్ , భూసేకరణకు అవసర మైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థుల సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రూ.206 కోట్ల ఆర్అండ్ఆర్, భూ సేకరణ నిధులను విడుదల చేశారని తెలిపారు. అందుకు సీఎంకు భువనగిరి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి , వలిగొండ , నకిరేకల్ , రామన్నపేట , తుంగతుర్తి ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూసీ మురుగు నీటిపై ఆధారపడకుండా గోదావరి జలాలతో రైతులు సాగు చేసు కునేలా బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేయడం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిం దన్నారు.ముఖ్యమంత్రి హయాంలో బస్వాపూర్ రిజర్వాయర్ లో ఐదు టీఎంసీల నీటిని నింపి రైతులకు సాగునీరు అందిం చేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కెనాల్ ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు చేరేందుకు నేషనల్ హైవే వద్ద అవసరమైన పనులు చేపట్టామనిశ, బునాదిగాని , ధర్మారెడ్డి , పిల్లాయిపల్లి కాల్వల పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేస్తామని తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా , ఆత్మ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి , మున్సిపల్ వైస్ పోతంశెట్టి మంజుల , పిఎసిఎస్ చైర్మన్లు సతీష్ పవన్ , శ్యామ్ గౌడ్ , పట్టణ కౌన్సిలర్లు, భువనగిరి నియోజక వర్గంలోని పలు మండలాల అధ్యక్షులు , ప్రజా ప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణపై డేగ కన్ను-తస్మాత్ జాగ్రత్త...

- పలు శిక్షలపై న్యాయ విజ్ఞాన సదస్సు
- అక్రమ రవాణా నివారణకు అందరూ కృషి చేయాలి
- జిల్లా కోర్టు ప్రధాన కార్యదర్శి వి. మాధవి లత దిశా నిర్దేశం



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ , యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ , జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పాతగుట్ట లోని సాహితి కన్వెన్షన్ హాల్ లో మానవ అక్రమ రవాణ బాదితులకు ఏర్పరిచిన జాతీయ న్యాయ సేవల పథకం పై , మానవ అక్రమ రవాణా చట్టం , శిక్షల అమలు , సమాజం మీదపడే ప్రభావం అంశాల పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి. మాధవి లత మానవ అక్రమ రవాణ బాదితులకు న్యాయ సేవ సంస్థ సంబంధిత శాఖల సమన్వయంతో పునరా వాసం , పరిహారం ,న్యాయ సేవలు అందించనున్నట్లు, ఎంతో ప్రగతి చెందుతున్న నేటి ప్రపంచంలో రవాణా చేయటం ,వ్యభిచార కోపంలోకి పంపటం అమానుషం అని దీనిని అరికట్టుటలో అందరూ బాధ్యతగా కృషిచేయాలని , రాజ్యాంగ హక్కు అందరికి కల్పించిం దని గౌరవంగా బ్రతికే విదంగా బాధిత లకు చేయూత ఇవ్వాలని తెలిపారు. ఇదే కాకుండా పునరావాసంలో భాగంగా అన్ని శాఖల జిల్లా అధికారులతో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించటమే కాకుండా వారికి మద్దత్తుగా సేవలు అందిస్తారని తెలిపారు. యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ బాదిత లను గర్తించి వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించ డంలో తమ పోలీసు శాఖ కృషి చేసిందని , లైంగిక వ్యాపారం నేరమని , కఠినమైన శిక్షలు ఉన్న యని , చట్టం పై అవగాహన కల్పించుకొని బాధ్యతతో , గౌరవంగా మనుగడ సాగించాలని తెలిపారు. యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ

మానవ అక్రమ రవాణపై యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కొత్తగా ఈ జిల్లాలో ఏర్పడిందని , జిల్లాలో మానవ అక్రమ రవాణపై ఎప్పటికప్పుడు డేగ కన్ను వేసి చర్యలు తీసు కుంటామని , అదేవిదంగా అవగాహన కల్పించటం , బాది తులకు పునరా వాసం కల్పించటంలో కృషి చేస్తుందని తెలిపారు. యాదాద్రి బార్‌అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సలహా , సేవలు కావాల్సి వస్తే తమ న్యాయ వాదులు తగిన సేవలు అందిస్తారని తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు బి. జయశ్రీ , డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డి , జిల్లా సంక్షేమ అధికారి సి. హెచ్. శ్రీనివాస్ , జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి అధికారి పద్మ , జిల్లా ఎస్ సి డెవలప్మెంట్ అధికారి సురేష్ , జిల్లా యూత్ , స్పోర్ట్స్ అధికారి శ్యామ్ సుందర్ , జిల్లా బాలల సంక్షేమ అధికారిని అనంత లక్ష్మి , జిల్లా విద్యా శాఖ సియంఓ లింగారెడ్డి , జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ డిపియం సుధాకర్ , స్వామి రామనంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ డిటిఓ గుర్రం వెంకటేష్ లు , సఖి కేంద్రం సెంట్రల్ అడ్మిన్ వినీల , సార్ప్ ఎన్ జి ఓ డా ప్రమీల వారి వారి శాఖల ద్వారా బాధిత లకు , ప్రజలకు అందించే సేవలు , సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్కీడ్ ఎన్. జి.ఓ. పి. డి నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా బాదితులకు , ఎయిడ్స్ ఉన్న వారికి ఉచిత సేవలు అందిస్తున్నామని , వారు సంఘంలో నిలదొక్కు కోవటానికి చేయూత ఇస్తున్నామని తెలిపి , బాధితులకు కావాల్సిన లబ్ధి పై అధికారులకు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ కమీషనర్ శ్రవణ్ , యాదాద్రి యం.పి.డి.ఓ, సి ఐ భాస్కర్ , ఎ హెచ్ టి యు సబ్ ఇన్స్పెక్టర్ తేజం రెడ్డి , స్కీడ్ ఎన్ జి ఒ జిల్లా కోఆర్డినేటర్ భాను కుమార్ , బాదితులు ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పోరుబాటకు బీజేపీ సంపూర్ణ మద్దతు

- మీ సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటాం.. లాఠీ దెబ్బలు మేమే తింటాం
- జేఏసీలో రాజీపడే నాయకులకు చోటివ్వొద్దు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఉద్యోగులను మోసం చేశాయి
- కరీంనగర్ డెయిరీని దెబ్బతీసే కుట్రలు సరికాదు



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ ఈనెల 27 నుంచి చేపట్టనున్న పోరుబాటకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే పోరాటంలో బీజేపీ సైనికులు ముందుండి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసినా, తూటాలు పేల్చినా ఉద్యోగుల కంటే ముందుగా తామే వాటిని ఎదుర్కొంటామని పేర్కొన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లను బండి సంజయ్ ఘనంగా సన్మానించారు. సమాజానికి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశంతో కలిసి ఉద్యోగుల జేఏసీ పోరుబాటకు మద్దతుగా మాట్లాడారు.

**ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ అన్నారు. పీఆర్సీ అమలు కావడం లేదని, హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన సుమారు రూ.2 వేల కోట్ల పెండింగ్ బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు. 317 జీవో బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసులు అమలు చేస్తామన్న హామీని ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీ కూడా అమలు కాలేదన్నారు.

**రాజీ పడే నాయకులను జేఏసీలో కొనసాగించొద్దు**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పైరవీలు కాకుండా పోరాటమే మార్గమని బండి సంజయ్ అన్నారు. గతంలో ఉద్యోగ సంఘాల జేఏసీ కార్యాచరణ ప్రకటించిన తర్వాత ప్రభుత్వం తూతూ మంత్రంగా హామీలు ఇవ్వగానే ఉద్యమాలను వాయిదా వేసిన సందర్భాలు ఉన్నాయని ఆరోపించారు.

ప్రభుత్వంతో రాజీపడే నాయకులను జేఏసీలో కొనసాగించవద్దని సూచించారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం చివరి వరకు పోరాడే బలమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కాంగ్రెస్ తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు. పదవీ విరమణ రోజే ఉద్యోగులకు అన్ని బెనిఫిట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని చెప్పినా విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**ఉద్యోగుల పోరాటానికి బీజేపీ అండ**

317 జీవో అంశంపై ఉద్యోగుల తరఫున బీజేపీ పోరాటం చేసిందని, ఆ పోరాటంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జైలుకు వెళ్లారని బండి సంజయ్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారు చేపట్టే పోరాటానికి చివరి వరకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అవసరమైతే ఉద్యోగులతో కలిసి తాము కూడా ఉద్యమిస్తామని చెప్పారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరాటం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు కోసం విద్యార్థుల పక్షాన బీజేపీ యువ మోర్చా పోరాడుతోందని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్‌లో వేలాది మందితో నిర్వహించనున్న ఫీజు పోరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొంటారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని వర్గాలు ఏకమై ప్రభుత్వ హామీల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**కరీంనగర్ డెయిరీని దెబ్బతీయొద్దు**

కరీంనగర్ డెయిరీ విషయంలో ప్రభుత్వం రాజకీయ కోణంలో వ్యవహరించవద్దని బండి సంజయ్ కోరారు. సాఫీగా సాగుతున్న డెయిరీని దెబ్బతీసి దాని ఆస్తులపై కన్నేయడం సరికాదన్నారు. లక్షలాది మంది రైతులకు మేలు చేసే సంస్థను ఏదో ఒక కారణంతో అప్రతిష్టపాలు చేసి రైతులకు అన్యాయం చేయాలని చూడటం దుర్మార్గమని విమర్శించారు.ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని మొత్తం వ్యవస్థను దెబ్బతీయడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ డెయిరీపై ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం సాయం చేయకపోయినా బాధ లేదని, కానీ డెయిరీకి అన్యాయం చేస్తే రైతులు క్షమించబోరని బండి సంజయ్ హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## - వీడియోకాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



**భద్రాద్రికొత్తగూడెం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఎన్నికల అధికారిసంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాలకలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌కు జిల్లా ఐడిఓసి కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్టతో కలిసి కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్నికలఅధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్‌కాని ఓటర్లు, వివరాల్లోని వ్యత్యాసాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం మ్యాపింగ్‌కానిఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీసమయంలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధృవపత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11రకాల ధృవపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 17నుంచి సెప్టెంబర్ 16వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని, అక్టోబర్ 15వరకు నోటీసులుజారీ చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్రస్థాయికి పంపాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహిం చేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించి అవసరమైన ధృవపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు.ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియకు సంబంధించిన స్థితిగతులను రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో గుర్తించిన వివరాల్లోని వ్యత్యాసాలు, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను నియోజకవర్గాల వారీగా వివరించారు. పినపాక నియోజకవర్గంలో 39,670వివరాల్లో వ్యత్యాసాలు, 16,421 నోమ్యాపింగ్, ఇల్లందు నియోజకవర్గంలో 37,660వివరాల్లో వ్యత్యాసాలు, 5,656 నోమ్యాపింగ్, కొత్తగూడెం నియోజకవర్గంలో 46,743 వివరాల్లో వ్యత్యాసాలు, 23,428నో మ్యాపింగ్ ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అశ్వారావుపేటనియోజక వర్గంలో 28,994వివరాల్లో వ్యత్యాసాలు, 7,361నో మ్యాపింగ్, భద్రాచలం నియోజకవర్గంలో 27,162 వివరాల్లో వ్యత్యాసాలు, 7,340 నోమ్యాపింగ్ ఉన్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,80,299 వివరాల్లో వ్యత్యాసాలు, 60,206నోమ్యాపింగ్ ఉన్నట్లు కలెక్టర్‌వివరించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఎదుర వుతున్న అంశాలను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తూ, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడు తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ధృవపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగానే ఖరారుచేయాలని అధికారులకు సూచించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవసరమైన శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి దశలోనూ అధికారులుసమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘంనిర్దేశించిన మార్గదర్శకాలు, కాల పరిమితులకుఅనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డీఓ మధు, ఎన్నికల విభాగం సూపరిెంటెంట్ రంగప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఇంధన భద్రతకు బొగ్గుతోపాటు పునరుత్పాదక విద్యుత్‌లో కూడా సింగరేణి కృషి

- మరో నాలుగు దశాబ్ధాల పాటు థర్మల్ విద్యుత్‌కు డిమాండ్
- అధికమొత్తంలో బొగ్గు అందించడానికి సింగరేణి ప్రణాళికలు : సిఎండి




**కొత్తగూడెంసింగరేణి ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ, రాష్ట్ర ఇంధన భద్రతకు సింగరేణిసంస్థ తగినంత బొగ్గును అందించడంతోపాటు పునరుత్పాతక విద్యుత్ రంగంలో కూడా తనవంతు కృషిచేస్తుందని సింగరేణి సంస్థచైర్మన్ బుద్ధప్రకాష్‌జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్‌అండ్ ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలోఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ దశాబ్ధాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తుందని, రాష్ట్రప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్రజెన్కో,ట్రాన్స్‌కో కలిసి సమిష్టిగా కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థతన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్‌విద్యుత్, క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని, అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మరో నాలుగుదశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. ఈచర్చగోష్టికి ప్రొఫెసర్ పవన్‌కుమార్ పరనంది సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈఎనర్జీ సమ్మిట్‌కు తెలంగాణ ఇంధన శాఖ స్పెషల్‌చీఫ్‌సెక్రటరీ నవీన్‌మిట్టల్ హాజరుకాగా, ప్యానెల్ డిస్కషన్‌లో సింగరేణి చైర్మన్‌తోపాటు తెలంగాణ పవర్ జనరల్ కార్పొరేషన్ సిఎండి ఎస్.హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదనం నిగం లిమిటెడ్ సిఎండి దేవేంద్రశృంగి, ఎన్టీపిసి సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్‌శర్మ, గ్రిడ్‌కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యప్రియరథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండి.కేదార్‌రంజన్ పాండు, ఛత్తీస్‌ఘడ్‌స్టేట్ పవర్ జనరేషన్‌కంపెనీ లిమిటెడ్ ఎండి సంజీవ్‌కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశీ శిక్షణ పూర్తి చేసుకున్న

# 39మంది ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లు

- ఇన్‌పుడ్ డీలర్లు రైతులకు సాంకేతిక సహాయకులుగా పని చేయాలి
- ప్రత్యామ్నాయ పంటలసాగుపై అవగాహన కల్పించాలి
- భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్



**భద్రాద్రికొత్తగూడెం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** చుంచుపల్లి రైతువేదికలో దేశీశిక్షణకోర్సును పూర్తి చేసుకున్న 39మంది ఇన్‌పుట్‌డీలర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారండిప్లొమా సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇన్‌పుట్ డీలర్లు రైతులకు వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని అందించే పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్స్‌గా కీలకపాత్ర పోషించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, శాస్త్రీయసాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలను రైతులకు చేరవేస్తూ వారి ఆదాయం పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో పంటల మార్పిడి, ఆయిల్ పామ్, కూరగాయలు, మిరపతదితర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ఒకే రకమైన పంటలను వరుసగా సాగు చేయడం వల్ల భూసారంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలసాగు, భూసార పరిరక్షణ, సేంద్రీయ కర్బనానిన పెంపొందించే పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా తగినసాంకేతిక సూచనలు అందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సుమారు 37శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపికచేసుకునేలా సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని సుమారు 2,300చెరువుల్లో 35శాతంకంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నందున, మట్టి తేమ, భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం తదితర అంశాలపై రైతులకుఅవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిమండలంలో సంబంధిత అధికారులుఅందుబాటులో ఉన్నందునవ్యవసాయశాఖ, నీటిపారుదల, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు సమన్వయంతో పనిచేసి రైతులకుఅవసరమైన సాంకేతిక సహకారం అందించాలన్నారు. రైతులకుసబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయాశాఖాధికారి బాబురావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు,క్రిమిసంహారక మందుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులవైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. దేశీ శిక్షణలో ప్రతిభ కనబర్చి గోల్‌మెడల్ సాధించిన గూడపాటి విజయభాస్కర్, సిల్వర్‌మెడల్‌సాధించిన అనగారి కళ్యాణ్‌లను కలెక్టర్ అభినందించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను కలెక్టర్ తన చేతులమీదుగా రైతులకుపంపిణీ చేశారు. అనంతరం చుంచుపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూభారతి, సాదాబైనామా కింద కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించారు. భూభారతి కింద కార్యాలయానికి వచ్చిన మొత్తం దరఖాస్తులు, స్వీకరించినవి, పరిశీలనలోఉన్నవి, ధృవీకరించినవి, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను దరఖాస్తులవారీగా పరిశీలించిన కలెక్టర్ ప్రతి దరఖాస్తు ఎందుకు పెండింగ్‌లో ఉంది, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు, ఇంకా ఏప్రక్రియ పూర్తిచేయాల్సి ఉందనే వివరాలను తహశీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అవసరమైన విచారణ, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత నివేదికల ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించిన భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధులు, బాధ్యతలను అడిగి తెలుసుకున్నారు.కార్యాలయానికి రోజువారి వచ్చే ప్రజల సంఖ్య, స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి నమోదు, పరిశీలన, పరిష్కారప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరంకలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ భూములు, హక్కులు, ధృవీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, వారి దరఖాస్తులను నిబంధనల మేరకు పారదర్శకంగా,వేగవంతంగా పరిష్కరించడం అధికారులు బాధ్యతన్నారు. ఏ దరఖాస్తును కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని తహశీల్దార్, సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుభాషిని, ఫెసిలిటేటర్ డేవిడ్‌జైపాల్‌రావు, వ్యవసాయాశాఖ ఏఓలు, అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకలకు ఎస్పీకి ఆహ్వానం



**కొత్తగూడెం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** బంజారా సంఘాల జాయింట్‌యాక్షన్‌కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతిమైదానంలో నిర్వహిస్తున్న తీజ్‌వేడుకలకు బుధవారం ఎస్పీ రోహిత్‌రాజును ఆహ్వానించారు. ఈనెల 15నుండి 23వరకు జరగనున్న తీజ్‌వేడుకల్లో భాగంగా ఈనెల 21న పోలీస్‌శాఖలో పనిచేస్తున్న బంజారా ఉద్యోగస్తులు పాల్గొననున్నారు. ఈమేరకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందచేశారు.ఈ సందర్భంగా జేఏసి చైర్మన్‌బానోతువీరునాయక్ మాట్లాడుతూ బంజారాతీజ్ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రతిరోజుబంజారాల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వేడుకలు కొనసాగుతున్నాయన్నారు. శుక్రవారం నిర్వహించే వేడుకలకు జిల్లాలోనిపోలీస్ శాఖ, వివిధ ప్రభుత్వ శాఖలో పనిచేసుత్తున్న ఉద్యోగులుఅధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేఏసి జిల్లా నాయకులు గుగులోతు భద్రు, బానోతు భరత్, వినోద్, మురళీ, లాలు, రాజా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని, ప్రభుత్వాన్ని రెండు కళ్లల కాపాడుకోవాలి

## - బీజేపీ, బీఆర్ఎస్‌కుట్రలను తిప్పికొట్టాలి : సచిన్‌సావత్‌జి




**ఖమ్మం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని, అటుప్రభుత్వాన్ని రెండుకళ్లల కాపాడుకోవాలని ఏఐసిసికార్యదర్శి సచిన్‌సావత్‌జి అన్నారు. ఖమ్మం కాంగ్రెస్ పార్టీ సంజీవరెడ్డి భవన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపొలిటికల్ ఎఫైర్స్‌కమిటీ పిసిసమావేశం డిసిసి అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసమావేశానికి ఏఐసిసికార్యదర్శి, రాష్ట్రరెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం లో సర్‌పేరుతో అటుబిజెపి ఇటుబీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై 73లక్షల ఓట్లు తొలగించి కాంగ్రెస్‌పార్టీ ఓటు బ్యాంకుని కొల్లగొట్టాలని కుట్రలు చేస్తున్నారని, ఆకుట్రలు సాగకుండా చూడాల్సిన అవసరం పార్టీప్రజాప్రతినిధులు, నాయకులు బిఎల్ఏలు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇటు కాంగ్రెస్‌పార్టీని అటు రాష్ట్రప్రభుత్వాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని సంస్థాగతంగా గ్రామ మండలకమిటీలు ఏర్పాటు పూర్తిచేసి పార్టీని మరింత బలోపేతంచేయాలన్నారు. ఈసమావేశంలో కేంద్రపార్టీ ఏఐసిసి,టిపిసిసి సూచించిన ఏడుఅంశాలకు చెందిన ఏజెండాలను చర్చించి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించివాటి అమలుకు క్యాడర్‌ను సమాయత్తం చేయాలని పకడ్బందీ ప్రణాళికతో ముందుకుసాగాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, తెల్లంవెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుచీకటి కార్తీక్, వై.శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబాబు, కొదుమూరి శ్రీనివాసరావు, నయీముద్దీన్ పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



**భద్రాద్రికొత్తగూడెం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.తుకారాం రాథోడ్ బుధవారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆసు పత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది పనితీరు, మందుల లభ్యత తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగ శాల, ఫార్మసీ గదులను పరిశీలించి రోగులకు అవసరమైన పరీక్షలు సకాలంలో నిర్వహించడం, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అవసరమైన మందులకు ముందుగానే ఇండెంట్ సమర్పించి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సులానగర్ పిహెచ్‌సి పరిధిలోని సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో గర్భిణీల నమోదు, ప్రసవానంతర తల్లులు, శిశువుల ఆరోగ్యపరీక్షలు తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. అర్హులైన గర్భిణీలను గుర్తించి సకాలంలో ఎఎన్‌సి నమోదు చేయడంతోపాటు,ప్రసవానంతర పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించి, నిరంతరం ఫాలప్ ఉండేలా పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలుఅందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్తగూడెంకేంద్రంలో నిర్వహిస్తున్న ప్రవేట్‌ఆసుపత్రి వి-కేర్ హాస్పటల్‌పై వస్తున్నవార్త కథనాలపై స్పందిస్తూ ఈ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుల వివరాలుఅడిగి తెలుసుకున్నారు. తరువాత నోటీసు బోర్డుపైన ఉన్న పేర్లులో సరిచూసి వారి సందర్శన సమయంలో ఉన్నతేడాను గమనించి నోటీసు ఇచ్చి వివరణ ఇమ్మని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.ప్రతాప్,మోహన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న ఛలో హైదరాబాద్

## - మహాధర్నాకు వేలాదిగా తరలిరండి : వెంకటరెడ్డి



**కొత్తగూడెం ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్10న హైదరాబాద్‌లో జరగనున్న మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు వేలాదిసంఖ్యలో తరలిరావాలని తెలంగాణరాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానికరామాటాకీస్‌రోడ్డులో ఉన్న రిటైర్డ్‌ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన పెన్షనర్ల గెట్ టుగేదర్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, అనేకమంది మానసిక ఆందోళనతో మృత్యువాత పడ్డారని, ఈపరిస్థితికి ప్రభుత్వ విధానాలేకారణమనానరు. పెన్షనర్ల పిఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని, రిటైర్‌అయిన ఉద్యోగుల బెనిఫిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.హెల్త్‌కార్డుల విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యం వల్ల అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు సరైన వైద్యసేవలు అందక అలవి కాని ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ చేసే ధర్నాకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘం అధ్యక్షులు ఇజిఆర్.వెస్లీ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో పి.వెంకటరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, కెఎస్‌సి.చౌదరి, వై.వెంకటేశ్వర్లు, ఎం.సుబ్బయ్య, అన్నిమండల యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి

- గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి
- ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
- ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలి
- మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి
- అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి మంత్రి దనసరి అనసూయ సీతక్క



**గోవిందరావుపేట ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని,మండల ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం తెలియజేయాలని,ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,అత్యవసర సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజలను సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయకూడదని,ఒంటరి మహిళలు, వితంతువుల,వికలాంగుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలని,స్థానిక అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని,
ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులను క్రమపద్ధతిలో స్వీకరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి వాటిపై సమాధానం తెప్పించి దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు.గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో ముందుగానే తెలియజేయడంతో పాటు, నిర్ణీత సమయంలో దరఖాస్తు పరిష్కారమైందా లేదా, పరిష్కారం కాకపోతే కారణం ఏమిటనే విషయాన్ని సంబంధిత వ్యక్తికి స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.అత్యవసర సమస్యల విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలకు అవసరమైన సమయాన్ని అంచనా వేసి, కనీసం వారం రోజుల్లో దరఖాస్తుదారులకు పురోగతిపై సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్య కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు.మండలాల వారీగా గ్రీవెన్స్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య తగ్గడంతో పాటు స్థానికంగానే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అధికారులు విధులను బాధ్యతగా, చిత్తశుద్ధితో నిర్వహించి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కార దిశగా పరిశీలించాలని సూచించారు. ఒంటరి మహిళలు, వితంతువులకు, సంబంధించిన పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి పూర్తి స్థాయిలో స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హుల పింఛన్లకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేదనే పరిస్థితి తలెత్తకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, అంతర్గత వాడలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత, సీసీ రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా బందును పాటించిన నల్లబెల్లి పెద్ది అభిమానులు

- పెద్దన్న విగ్రహం అక్రమ తొలగింపుపై గర్జించిన నల్లబెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు



**నల్లబెల్లి ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అక్రమ తొలగింపు పై బిఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన బందు పిలుపుమేరకు స్వచ్ఛందంగా నల్లబెల్లి మండల పెద్ది అభిమానులు వ్యాపార, విద్యాసంస్థలు బందును పాటించారని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బానోతు సారంగపాణి అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ పునఃప్రతిష్టే లక్ష్యంగా మండల కేంద్రంలో ర్యాలీ, పెద్ది నినాదాలతో నల్లబెల్లి దద్దరిల్లింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాని నర్సంపేట మెడికల్ కాలేజ్ వద్ద ఉద్యమ నేత, నర్సంపేట అభివృద్ధి ప్రదాత మాజీ శాసనసభ్యులు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే అక్రమంగా తొలగించడంపై మండల వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తాయన్నారు. బుధవారం నర్సంపేట బంద్ పిలుపు సంపూర్ణంగా శాంతియుతంగా జరిగింది. విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే తిరిగి ప్రతిష్టించే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు. స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజానీకం ప్రజాప్రియ నాయకుడి విగ్రహానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని వ్యాపారులు వాణిజ్య సముదాయాలు ప్రైవేటు విద్యాసంస్థలు, స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయన్నారు. ర్యాలీ అనంతరం ఎస్ఐ ఆధ్వర్యంలో భారీగా మోహరించిన పోలీసులు సారంగపాని, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్, మాజీ ఎంపీపీ లు కక్కేర్ల శ్రీనివాస్ గౌడ్, ఊడుగుల ప్రవీణ్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కోటిలింగాచారితో పాటు పలువురు సర్పంచ్‌లను, మండల స్థాయి నాయకులను, కార్యక ర్తలను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అదే స్థలంలో పునః ప్రతిష్టించేంత వరకు ఈ ఉద్యమం ఆగే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి హెచ్చరించారు.

# కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నుండి కాలువల ద్వారా దిగువకు సాగునీటి విడుదల

- కుడి,ఎడమ కాలువల ద్వారా దిగువకు సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి
- ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటిమట్టం 0.9 టీఎంసీలు...
- తాగునీటి అవసరాల కోసం 0.6 టీఎంసీలు అవసరం...
- కాలువల్లో నీరు ప్రవహించడం వల్ల భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది





**దేవరకద్ర, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గం,దేవరకద్ర మండలంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఈరోజు కుడి, ఎడమ కాలువల ద్వారా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి దిగువకు సాగునీటిని విడుదల చేశారు.
ఈ సంధర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఇందులో తాగునీటి అవసరాల కోసం 0.6 టీఎంసీల నీటిని కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు బోర్లు రీఛార్జ్ అయ్యేలా ఈ రోజు మొదటి విడతగా కాలువల ద్వారా నీటిని విడుదల చేశామని ఎమ్మెల్యే గారు తెలిపారు. సాధారణంగా కాలువలకు నీటిని విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో కనీసం 1.5 టీఎంసీల నీరు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని బోర్ల రీఛార్జ్, చెరువుల నింపుదలకు నీటిని విడుదల చేశామని తెలియజేశారు. నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో రైతులు కొత్తగా నారుమళ్లు వేయవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి,ఇలాంటి క్లిష్ట సమయాల్లో పరిస్థితుల్లో ఆరుతడి పంటల వైపే రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే జిఎంఆర్ రైతులకు సూచించారు. వారం రోజుల తర్వాత రిజర్వాయర్‌లో నీటి మట్టం ఎంతమేర పెరిగిందో పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా సాధ్యమైనంత మేర రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే జియంఆర్ రైతులకు హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మరియు వివిధ గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రజలకు అందుబాటులో పంచాయతీ పాలన
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాల మండల పరిధిలోని జిల్లెడబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు, పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల ద్వారా ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. గతంలో సరైన నీటి సౌకర్యం లేక గ్రామాల నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని ఎమ్మెల్యే తెలిపారు. గత కొన్నేళ్లుగా నీరు, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడటంతో గ్రామంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం కూడా రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లెడబండలో గ్రామ పంచాయతీ భవనానికి ఎనిమిది నెలల క్రితం పూజా కార్యక్రమాలు నిర్వహించగా, త్వరగా నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన కార్యాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా సహకరించాలని కోరారు. గ్రామం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.



**ఎమ్మెల్యే సహకారం కొనసాగాలి...** గ్రామ సర్పంచ్ నాగేష్ నాయుడు మాట్లాడుతూ.. చిన్న గ్రామ పంచాయతీల్లోనూ కార్యాలయ భవనాలను ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలనను చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎమ్మెల్యే సహాయ సహకారాలు గ్రామానికి కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, సత్యారెడ్డి, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, కిట్టు, ఎంపీడీవో శైలజ, పంచాయతీ కార్యదర్శి కవిత, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

**మిర్యాలగూడ, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** అంగన్వాడీ కేంద్రాలను పకడ్బందిగా నిర్వహించాలని మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ వేణుగోపాలరావు అన్నారు.
బుధవారం మండల పరిషత్ ఆవరణలోని రైతువేదికలో జరిగిన మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు సకాలంలో ఓపెన్ చేయాలని పిల్లలకు ప్రీస్కూల్ యాక్టివిటీస్ అంశ పద్ధతి ద్వారా నేర్పించాలని అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. ప్రీస్కూల్ పిల్లల నమోదు పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్హెచ్టిఎస్ యాప్‌లలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాపులలో ఏరోజుకారోజు ఆన్లైన్



చేయాలని, పిల్లలకు టిహెచ్ఆర్ ఇచ్చి ఎఫ్ఆర్ఎస్ కంప్లీట్ చేయాలనిఅంగన్వాడి కేంద్ర పరిధిలో బాల్యవివాహాలు జరగకుండా చూడాలని బాల కార్మికుల నిర్మూలన జరగాలన్నారు.
ఎక్కడైనా అక్రమ దత్తత తీసుకున్నట్లుగా తెలిస్తే అట్టి విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ కె.నాగమణి నజీమా బేగం మహమ్మద్, సిహెచ్.పద్మ, ఆర్.వాణి ఎ.సంధ్య, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డిసిపిఓ గణేష్, సఖి సెంటర్ నుండి సునీత, నాగిరెడ్డిరూరల్, అర్బన్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల సమ్మె

## - ఎనిమిది నెలలుగా వేతనాలు లేవని ఆవేదన



**గద్వాల, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ధరూర్ మండలం జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న 90 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదని ఆరోపిస్తూ బుధవారం సమ్మెకు దిగారు. ఐహెచ్‌పీ, ఎక్సలెంట్, మెగా కంపెనీలకు చెందిన లైన్‌మెన్, ఫిట్టర్లు, బ్యాక్‌వాష్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికులు ఆందోళన చేపట్టారు. ఐహెచ్‌పీ, ఎక్సలెంట్ కంపెనీలకు చెందిన సుమారు 200 మంది కార్మికులకు గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించలేదని కార్మికులు ఆరోపించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిబంధనలు విధించినప్పటికీ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించే పనిలో ఉన్న తమకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు వాపోయారు. వేతనాల సమస్యపై అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను కార్మికులకు చెల్లించేలా సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించాలని వారు కోరారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు.

# శ్రీధర్ కొల్లూరికి జాతీయ ఉత్తమ గ్రంథపాలక పురస్కారం



**పర్వతగిరి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** వాగ్దేవి ఫార్మసీ కళాశాల, బొల్లికుంట, వరంగల్‌లో లైబ్రేరియన్‌గా సేవలందిస్తున్న శ్రీధర్ కొల్లూరికి ప్రతిష్ఠాత్మకమైన "నేషనల్ బెస్ట్ లైబ్రేరియన్ అవార్డు --2026" లభించింది. ఈ పురస్కారాన్ని MALA వారు చెన్నైలో అందజేశారు. గ్రంథాలయ, సమాచార విజ్ఞాన రంగంలో శ్రీధర్ కొల్లూరి అందిస్తున్న విశిష్ట సేవలు, విద్యార్థులు, అధ్యాపకులకు మెరుగైన గ్రంథాలయ సేవలను అందించడంలో చేసిన కృషి, డిజిటల్ లైబ్రరీ సేవల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, జర్నల్స్, ఈ-రిసోర్సెస్, సమాచార వనరులను సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో నిరంతరం కృషి చేస్తున్నారు. కళాశాలలోని లైబ్రరీ సేవలను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా వాగ్దేవి ఫార్మసీ కళాశాల ఈ జాతీయ పురస్కారం పట్ల కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు శ్రీధర్ కొల్లూరిని అభినందించారు. ఈ జాతీయ స్థాయి పురస్కారం వాగ్దేవి ఫార్మసీ కళాశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# చరిత్రకు సజీవ సాక్షాలు, తరతరాలకు జ్ఞాపకాలే ఫోటోలు

## - జిల్లా ఎస్పీ డి సునిత రెడ్డి..



**వనపర్తి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** చరిత్రకు సజీవ సాక్ష్యాలు, తరతరాలకు జ్ఞాపకాల వారధులే ఫోటోలు అని జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫోటో జర్నలిస్టులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పి పాల్గొని కేక్ కట్ చేసి ఫోటో జర్నలిస్టులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ .. ఒక్క ఫోటో వెయ్యి మాటల భావాన్ని చెబుతూ, ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలుపుతుందనీ పేర్కొన్నారు. ఒక తరానికి చెందిన చరిత్రను మరో తరానికి అందిస్తూ సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఎలాంటి అలంకరణ లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తి ఫోటో జర్నలిజానిదని స్పష్టం చేశారు. సమాజంలో జరిగే ప్రతి సంఘటనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తూ, నిజాన్ని ఎలాంటి భేషజం లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తివంతమైన మాధ్యమం ఫోటో జర్నలిజం అని ఫోటోగ్రఫీ కేవలం ఒక కళ మాత్రమే కాదనీ .. అది చరిత్రను భద్రపరిచే బాధ్యత, సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే ఆయుధం అని కొనియాడారు. సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక మార్పులు, ప్రజల జీవన విధానం, కీలక సంఘటనలు .. వీటినన్నింటిని భావితరాలకు అందించే సజీవ దస్తావేజులు ఛాయాచిత్రాలు అని గుర్తు చేశారు. ఒక మంచి ఫోటోలో ఒక కథ, భావోద్వేగం, సందేశం, చరిత్ర ఉంటుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పి బాలాజీ నాయక్, సీఐ సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ఫోటో జర్నలిస్టులు, రాము, బాలరాజు, యూసుఫ్, యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్, ఆంజనేయులు, జ్ఞానమూర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి పవిత్రమైనది


## - జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - బీసీ పొలిటికల్ జేఏసీ పట్టణ అధ్యక్షుడు దేవర శివ..



**వనపర్తి, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని బిసి పొలిటికల్ జేఏసీ పట్టణ అధ్యక్షులు దేవరశివ అన్నారు.నూతనంగా నియమితులైన జిల్లా మరియు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ భాస్కర్ నాయక్‌ను బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులతో ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలే బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ .. వైద్యులు అంటేనే భగవత్ స్వరూపుడైన నారాయణ స్వామితో సమానమని పేర్కొన్నారు. అన్ని వృత్తులలో కెల్లా వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ..అలాంటి వైద్య వృత్తిలో జిల్లా అధికారిగా నియమితులైన డాక్టర్ భాస్కర్ నాయక్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను, వైద్యసిబ్బందిని సమన్వయం చేసి ఎలాంటి సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ఏర్పాట్లు చేసి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని కోరారు. ప్రజలకు మంచి చేసే ప్రతిఅధికారిని బీసీ పొలిటికల్ జేఏసీ వెన్నుతట్టి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివి గౌడ్,మహేందర్ నాయుడు,ధర్మేంద్ర సాగర్,ఆస్కని రమేష్, నిప్పు నాగరాజు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో



**ములుగు, ఆగస్టు 20 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ బర్కడే హేమంత్ సహదేవరావుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన టిఎన్జిఎస్ యూనియన్ అధ్యక్షులు పోలురాజు మరియు కార్యదర్శి మేడి చైతన్య కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు భూక్యా లాల్, ఉదయ్ కుమార్ రెడ్డి అసోసియేట్ అధ్యక్షులు, వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ శ్రీవాణి పిట్టల రవి.జి రమాదేవి, రామ్గోపాల్ నరసయ్య రమేషు మరియు ములుగు జిల్లా ఎన్జీవోస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## భూ సమీకరణ వేగవంతం చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** సి.ఆర్.డి.ఏ రెండవ విడత భూ సమీకరణలో భాగంగా రైతులకు అవగాహన కల్పించాలని, భూ సమీకరణ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. భూ సమీకరణపై సి.ఆర్.డి.ఏ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. నోటిఫై చేసిన భూముల సమీకరణ ఆవశ్యమని అందుకు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.
ఈ సమావేశంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు ఎ.భార్గవ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్ లు, సంబంధిత మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధి ప్రతిపాదనలు వారంలోగా సిద్ధం చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగర పాలక సంస్థ పరిధిలోని నల్లపాడు చెరువు, ఎన్.టి.ఆర్. మానస సరోవరంలోని చెరువుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వారంలోగా సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతికి పంపించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఏపీయూఐఏఎంయల్ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంయల్) ప్రతినిధులతో చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత నల్లపాడు చెరువు, ఎన్.టి.ఆర్. మానస సరోవరాల అభివృద్ధికి ఏపీయూఐఏఎంయల్ ప్రతినిధులు రూపొందించిన డీపీఆర్‌ను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తొలిదశలో నల్లపాడు చెరువు, ఎన్.టి.ఆర్. మానస సరోవరంలోని చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధి పనుల్లో వాకింగ్ ట్రాక్, గ్రీనరీతో పాటు చెరువు చుట్టూ రైలింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చెరువులను అభివృద్ధి చేయాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతికి పంపించాలని ఏపీయూఐఏఎంయల్ ప్రతినిధులు, జీఎంసీ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, సెంట్రల్ డివైడర్లలో అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధికి కూడా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏపీయూఐఏఎంయల్ ప్రతినిధులు ఆంజనేయులు, బేబి, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



- **మంగళగిరి ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో 750 విధ్యార్దిని విధ్యార్దులకు వైద్య పరీక్షలు**

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్) :** దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలోని కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాలలో విధ్యార్ధిని విధ్యార్ధులకు మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, జనరల్ సూపర్ స్పెషాలటీ హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కార్యదర్శి సోము కృష్ణమూర్తి శిబిరంను రిబ్బను కట్ చేసి శిబిరంను ప్రారంభించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యం, చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, చెవి, ముక్కు, గొంతు, చర్మం, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్ల వైద్యం, మహిళల వైద్యం తదితర విభాగాలకు చెందిన వైద్యులు సేవలు అందించారు. శిబిరంలో సుమారు 750 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సూచనలు, చికిత్సకు సంబంధించిన సలహాలు అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్లు డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, డాక్టర్ పొలవరపు రాఘవరావు, డీన్ డాక్టర్ ఎన్. లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. శ్రీనివాసరావు, కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ రవీంద్ర, వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్ధిని విద్యార్దులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



- **మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వెల్డింగ్ మిషన్ పంపిణీ**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో మంగళగిరి కొత్తపేటకు చెందిన సజ్జ సాయి కుమార్‌కు వెల్డింగ్ మిషన్‌ను పంపిణీ చేశారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించి, ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ ఈ సహాయాన్ని అందించారు.
ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాస పద్మావతి, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రంగిశెట్టి నరేంద్ర (బాబీ), సుఖమంచి గిరిబాబు, తాడిగిరి సుధీర్, సైనాదం శ్రీనివాసరావు, మంగళగిరి శ్రీనివాసరావు, ముసలయ్య, లక్ష్మయ్య, గురజాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో మహిళల పై అసభ్యకర దూషణలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

- **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**
- **మహిళలపై సోషల్ మీడియా వేధింపుల అంశంపై అసెంబ్లీలో చర్చ జరపాలని విజ్ఞప్తి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** వెలగపూడిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల జీరో అవర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న అసభ్యకర దూషణలు తీవ్రంగా ఖండించారు.
ప్రస్తుతం సోషల్ మీడియా వేదికల ద్వారా మహిళలపై అత్యధిక స్థాయిలో అవమానకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననాలు, వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.
మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రస్తుత లేదా రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రత్యేక లఘు చర్చ నిర్వహించాలని సభాపతి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.
సోషల్ మీడియాలో మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు, తప్పుడు ప్రచారాలు, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు ప్రభుత్వం మరింత దృఢమైన విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## సంక్షేమమంటే కుటుంబానికి భరోసా : ఎమ్మెల్యే నసీర్

- **అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా పథకాల అమలు**
- **తల్లికి వందనంతో బిడ్డల భవితకు నమ్మకం**
- **వైసీపీ పాలలో నవరత్నాల పేరిట నవ మోసాలు**
- **అసెంబ్లీలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర ఏళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి, వాటి వల్ల కలిగే లబ్ధి గురించి అసెంబ్లీ సాక్షిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ వివరించారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. సంక్షేమం అంటే కేవలం డబ్బు పంచడమే కాదని, ఒక కుటుంబానికి భరోసా కల్పించడం అని స్పష్టం చేశారు. బిడ్డల భవితకు అందించే నమ్మకంగానూ, అన్నదాతల పంటకు ధైర్యంగానూ, మహిళ ఆర్థిక స్వావలంబనగానూ ను సంక్షేమాన్ని తీసుకొచ్చామని చెప్పారు. వైసీపీ పాలనలో నవరత్నాల పేరిట నవ మోసాలు చేశారని విమర్శించారు. సంక్షేమం పేరిట సంక్షోభం తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికల్లో వాగ్దానాలను కేవలం హామీల అమలుగానే కాకుండా పరిపాలన బాధ్యతగా కూటమి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి బాటలు వేసే విధంగా అమలు చేస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో రూ. 2 వేల పింఛన్ ను రూ.3 వేలకు పెంచేందుకు నాలుగు సంవత్సరాల సమయం పట్టిందని సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేసారి నాలుగు వేలు పింఛన్ అందిస్తోందని తెలిపారు. ఆనాడు పింఛన్లను వాలంటీర్లతో పంపిణీ చేసి ప్రజాధనాన్ని వృథా చేస్తే ప్రస్తుతం సచివాలయ సిబ్బంది ద్వారా జవాబుదారీతనంతో ఒకటో తేదీనే ఇంటి వద్దకే అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పేరిట విద్యార్థులను దగా చేస్తే ఇప్పుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా విప్లవానికి నాంది పలుకుతూ ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు తల్లికి వందనం ద్వారా అమలు చేస్తున్నామన్నారు. దీపం పథకం కింద 4. 57 కోట్ల సిలిండర్లు ఉచితంగా అందించడం,, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తూ ఇప్పటివరకు 87 కోట్ల మందికి లబ్ధి చేకూర్చామని తెలిపారు.

## కీటక జనిత వ్యాధుల నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలి

- **బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ**




**బాపట్ల జిల్లా మెడికల్ (జర్నలిస్ట్ ఫైల్ ):** దోమల వల్ల ప్రబలే కీటక జనిత వ్యాధుల నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది పట్టుదలతో కృషి చేయాలని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ పిలుపునిచ్చారు. ఆగస్టు 20 గురువారం రోజున జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన "ప్రపంచ దోమల దినోత్సవం" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దోమల దినోత్సవ విశిష్టత 1897లో సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి దోమ కాటు వల్లే వస్తుందని కనుగొన్నారని, ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటామని డాక్టర్ విజయమ్మ తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన జీవులైన దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు, జీకా వంటి తీవ్రమైన వ్యాధులు వ్యాపిస్తాయని, వీటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా మలేరియా అధికారి వి. నాగార్జున రావు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా "దోమలు పుట్టరాదు – దోమలు కుట్టరాదు" అనే నినాదంతో నివారణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే – డ్రై డే" పాటించాలని పిలుపునిచ్చారు. కాల్వల్లో నిల్వ నీటిని తొలగించడం, కూలర్లు, కుండలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల తెరలు వాడటం, క్రిమిసంహారక రసాయనాలు స్ప్రే చేయడం మరియు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు.
ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి ఖదీర్, సబ్–యూనిట్ అధికారులు షకీల్, శేషు బాబు, రవి, సుధాకర్, ఎల్లయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కూరపాటి సత్యం రాజు మరియు జిల్లాలోని హెల్త్


## గుంటూరు వెస్ట్ ఎంఈఓను కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్) :** నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గుంటూరు వెస్ట్ మండల విద్యాశాఖ అధికారి షేక్ షరీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఈ–ఎస్ఆర్ చేయాల్సిన నేపథ్యంలో మండలంలోని ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లను (ఎస్ఆర్) అప్‌డేట్ చేయాలని కోరారు. దీనిపై ఎంఈఓ స్పందిస్తూ ఇప్పటికే కొన్ని ఎస్ఆర్‌లను అప్‌డేట్ చేశామని, మిగిలిన వాటిని కూడా సకాలంలో పూర్తిచేసి ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర మున్సిపల్ శాఖ కన్వీనర్ పి. లలిత బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, గుంటూరు ఈస్ట్ మండల అధ్యక్షుడు కె. వీర రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాసరావు, గుంటూరు వెస్ట్ మండల అధ్యక్షుడు టి. రవి, ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వసతులు, భద్రత కల్పించాలి

- **గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు**
- **బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు**



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రత, భద్రత, భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బాపట్లలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
తొలుత బాపట్ల తహసిల్దార్ కార్యాలయ రోడ్డులోని సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్, పరిసరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల హాజరు పుస్తకాలను తనిఖీ చేశారు. బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకుని వసతి గృహం ముందుభాగంలో వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం సంజయ్ గాంధీ కాలనీలోని గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి, వంటశాల, మరుగుదొడ్లు, భోజనశాలను పరిశీలించారు. భోజనశాలలో వెలుతురు కోసం విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరులో వ్యత్యాసం ఉండటం, వార్డెన్ పనితీరు సంతృప్తికరంగా లేకపోవడంపై వివరణ కోరారు. ఆవరణలో ఇతరుల వాహనాలు నిలపడంపై చర్యలకు ఆదేశిస్తూ, శిథిలావస్థలోని పాత భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.
'సేవా సేతు' వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా దాతల నుంచి వారం రోజుల్లోగా విద్యార్థులకు ఆట వస్తువులు, సామగ్రి సమకూర్చాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

## ఉద్యోగ సాధనే లక్ష్యంగా అడుగులు వేయాలి



- **విద్యార్థులకు ఉచిత అవగాహన సదస్సు**
- **జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజారావు, డీఎస్‌డీఓ మాధవి పిలుపు**

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, ప్రభుత్వ ఉద్యోగ సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని బాపట్ల జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి (డీఎస్‌డీఓ) మాధవి సూచించారు.
బాపట్లలోని సరస్వతీ మెమోరియల్ బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అలాగే వ్యవసాయ కళాశాలల్లో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులందరూ వెంటనే 'నైపుణ్య పోర్టల్' వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

**లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు**

నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు, భావపురి సంస్థ ప్రాంశుపాలురు ఆవల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యూపీఎస్సీ సివిల్స్, ఎస్ఎస్సీ, రైల్వే, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, నవరత్న కంపెనీలు, పరిశోధన మరియు శాస్త్రవేత్త పోస్టులకు సంబంధించి ప్రతి సంవత్సరం లక్షకు పైగా ఖాళీలు విడుదలవుతున్నాయని తెలిపారు.
వాటి నోటిఫికేషన్లు, ఖాళీల సంఖ్య, పరీక్షల సిలబస్‌పై విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించారు.
వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రసూన రాణి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కళాశాలలోని 'ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్' ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు.
డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కలాం, భౌతిక–రసాయన శాస్త్ర అధ్యాపకుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ కళాశాలలో డాక్టర్ సుశీల, డాక్టర్ హైమ జ్యోతి, డాక్టర్ అపర్ణల మార్గదర్శకత్వంలో నిర్వహించారు.
ఈ సదస్సుల్లో సహాయ నైపుణ్యాభివృద్ధి అధికారి రవిశంకర్, కార్యాలయ సీనియర్ ఉద్యోగి అనీష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు డిగ్రీ కళాశాల మంజూరు

- **రాష్ట్రంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు మొట్ట మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల**
- **23వ తేదీ నుండి దరఖాస్తులు స్వీకరణ**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** వినికిడి లోపం ఉన్న ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్ మరియు వ–యోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు యస్.వెంకటరవనప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొట్ట మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.
ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బాపట్ల జిల్లా వెదుల్లపల్లి వద్ద ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం నుండి అనుమతి మంజూరు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్ మరియు వయోవృద్దుల సంక్షేమ శాఖ సంచాలకులు తెలిపారని పేర్కొన్నారు. ప్రస్తుత 2026 – 27 విద్యా సంవత్సరంలో 30 సీట్లతో ఏ.ఐ సర్టిఫికేషన్ కోర్సుతో బి.కాం (కంప్యూటర్ అప్లికేషన్స్ ప్రధాన సబ్జెక్టుగా) కోర్సును అందించడం జరుగుతుందని తెలిపారు.
రాష్ట్రంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థిని విద్యార్థుల ఈ నెల 23వ తేదీ నుండి దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు. వివరాలకు 9000013633/ 9948372899 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలి

**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టలేదని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలంలో ఒక్క డీఏ మాత్రమే మంజూరు చేశారని, పెండింగ్ బకాయిల్లో కొంత మొత్తాన్ని మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు క్యాబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని, దీంతో ఉద్యోగుల్లో రోజురోజుకూ ఆందోళన పెరుగుతోందన్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో మంచి పీఆర్సీ, పెండింగ్ డీఏలు, మెరుగైన ఐఆర్, బకాయిల చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని, చివరకు 12వ పీఆర్సీ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు.
ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల సమస్యలపై స్పందించి 12వ పీఆర్సీ కమిషన్ నివేదికతో సంబంధం లేకుండా ఏకంగా 29 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని చాంద్ బాష కోరారు.
ఉద్యోగుల మిగిలిన సమస్యలపై చర్చించేందుకు రాష్ట్రంలో రిజిస్టర్ అయిన ఉద్యోగ సంఘాలను ప్రభుత్వం ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టకపోతే సెప్టెంబర్ 1 తర్వాత కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో రూ.2.01 లక్షల సీఎం సహాయ నిధి సాయం



**తెనాలి( జర్నలిస్ట్ ఫైల్)** : తెనాలి నియోజకవర్గానికి చెందిన పఠాన్ నజీరున్నీసా వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2,01,460 ఆర్థిక సాయం మంజూరైంది. తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ, ప్రత్యేక సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంజూరైన మొత్తానికి సంబంధించిన రూ. 2,01,460 చెక్కును గురువారం వారికి అందజేశారు. ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ చెక్కును అందజేయగా మల్లవరపు విజయ్, ఫణిదపు దుర్గ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శరవేగంగా శాశ్వత భవన నిర్మాణాలు

- చురుగ్గా 4,500కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు
- పట్టణ పీహెచ్‌సీల్లో 502 సొంత భవనాల్లో.. 55 అద్దె భవనాల్లో
- సొంత భవనాల్లోనే పీహెచ్‌సీలు
- శాసనసభలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పీహెచ్‌సీలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణాల పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు తొలి కేంద్రాలుగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను పటిష్టం చేయడంతోపాటు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పీహెచ్‌సీలకు శాశ్వత భవనాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. శాసన సభలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ జవాబులిచ్చారు.

**పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టుల ఖాళీలు 57 మాత్రమే :** రాష్ట్రంలో పీహెచ్‌సీలకు సంబంధించి భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1,231 పీహెచ్‌సీలు ఉండగా.. 1,143 పీహెచ్‌సీలు సొంత భవనాల్లో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. 'కొత్తగా మంజూరైన 88 పీహెచ్‌సీ భవనాల్లో 13 పూర్తయ్యాయి. శిథిలావస్థకు చేరిన 140 పీహెచ్‌సీ భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టగా.. వాటిలో 118 పూర్తయ్యాయి. మరో 22 నిర్మాణంలో ఉన్నాయి. పీహెచ్‌సీ భవనాల బలోపేతానికి చేపట్టిన 948 పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో మరో 100 పీహెచ్‌సీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టిన 43 పనుల్లో 14 పూర్తికాగా, 29 నిర్మాణంలో ఉన్నాయి. మరో 57 భవనాల పనులు టెండర్ దశలో ఉన్నాయి. గత రెండేళ్లలో పీహెచ్‌సీల్లో 600కు పైగా నియామకాలు చేపట్టాం. మొత్తం 1,200 పీహెచ్‌సీలు ఉండగా ప్రస్తుతం 57 వైద్యుల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో భర్తీ చేస్తాం" అని మంత్రి వెల్లడించారు.

**502 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు :** "పట్టణ ప్రాంతాల్లో 560 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉండగా 175 ఇప్పటికే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. కొత్త భవనాల నిర్మాణానికి మరో 385 కి అనుమతులు మంజూరయ్యాయి. వీటిలో 327 భవనాలు నిర్మించి అప్పగించారు. మరో 55 భవనాల నిర్మాణం కొనసాగుతోంది. మూడు భవనాల అంశం కోర్టులో ఉంది. మొత్తంగా 502 యూపీహెచ్‌సీలకు సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి. మరో 55 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి" అని మంత్రి తెలిపారు.

**విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాల్లోనూ పురోగతి:** గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లపై మంత్రి మాట్లాడుతూ ఇవి జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో కొనసాగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ 15వ ఆర్థిక సంఘం, ఎన్‌హెచ్‌ఎం, పీఎం అభీమ్ తదితర పథకాల కింద 3,105 సంఖ్యలోనే సొంత భవనాలు నిర్మించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేవలం రెండేళ్లలోనే 4,500కు పైగా భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇవే ప్రజలకు తొలి ఆరోగ్య సేవా కేంద్రాలు కావడంతో వాటిని పటిష్టం చేస్తున్నామని వివరించారు. అవసరమైన చోట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(ఎంఎల్‌హెచ్ పీలు) నియామకాలు కూడా చేపడుతున్నామని తెలిపారు.

**ఉచితంగా 41 రకాల పరీక్షలు :** ముఖ్యమంత్రి దార్శనికత మేరకు వ్యక్తి కేంద్రంగా వైద్య సేవలు అందించేందుకు 'సంజీవని డిజిటల్ హెల్త్' ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. ఇందులో ఇంటివద్దే 41 రకాల పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతోపాటు అవసరమైన వారికి తదుపరి వైద్యం, అపాయింట్‌మెంట్లు, మందులు, డిజిటల్ హెల్త్ రికార్డు నిర్వహణ వంటి సేవలను అందించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు.

## నితిన్ నబిన్‌కు 'భారత్ రైజింగ్' పుస్తకం అందజేత



**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు డాక్టర్ కిలారు దిలీప్ తాను రచించిన 'భారత్ రైజింగ్: ఇన్ ది మోదీ ఎరా' పుస్తక ప్రతిని అందజేశారు.

విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి నితిన్ నబిన్ హాజరయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారి విశాఖపట్నం పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'భారత్ రైజింగ్: ఇన్ ది మోదీ ఎరా' పుస్తకంలో భారతదేశ సుసంపన్నమైన నాగరికతా వారసత్వం నుంచి ఇటీవలి కాలంలో దేశంలో చోటుచేసుకున్న పరివర్తన వరకు వివిధ అంశాలను డాక్టర్ కిలారు దిలీప్ వివరించారు. జాతీయ అభివృద్ధి, దేశ ప్రగతి, ప్రపంచ వేదికపై భారత్ పెరుగుతున్న ప్రభావం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలను పుస్తకం విశ్లేషిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ సాధిస్తున్న ప్రగతి, ప్రపంచస్థాయిలో పెరుగుతున్న ప్రాధాన్యతను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని దిలీప్ తెలిపారు.

పుస్తకాన్ని పరిశీలించిన నితిన్ నబిన్ దిలీప్ కృషిని అభినందించారు. భారతీయ నాగరికతా మూలాలు, దేశ అభివృద్ధి ప్రయాణం, భవిష్యత్ దిశ వంటి అంశాలను సమగ్రంగా ఒకే గ్రంథంలో పొందుపరిచేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రశంసించారు.

దేశంలో చోటుచేసుకుంటున్న మార్పులను, భారతదేశ ప్రగతిని, ప్రపంచ వేదికపై పెరుగుతున్న దేశ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు డాక్టర్ కిలారు దిలీప్ తెలిపారు.

## ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చొరవతో రూ.5.30 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం



**వేమూరు( జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది అనారోగ్య బాధితులకు మొత్తం రూ. 5,30,852 ఆర్థిక సహాయం మంజూరైంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించి వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సుతో దరఖాస్తులు సీఎంఆర్ ఎఫ్ కార్యాలయానికి పంపగా, అధికారులు పరిశీలించి అర్హులైన వారికి ఆర్థిక సహాయం మంజూరు చేశారు.

మంజూరైన చెక్కులను నక్కా ఆనంద బాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. గాజులలంకకు చెందిన గాజుల మల్లేశ్వరికి రూ. 1,22,979, కొల్లూరుకు చెందిన చందోలు నాగేశ్వరరావుకు రూ. 60,195, సోమరౌతు వెంకట్రావుకు రూ. 55,250 అందాయి.

చినపులివర్రుకు చెందిన పాచిగళ్ల రత్నసురమణికి రూ. 43,836, మిరియాల నాగలక్ష్మికి రూ. 23,920, పాచిగళ్ల సుమన్‌కు రూ. 28,155, పెసర్లంకకు చెందిన చావలి అభిషేక్‌కు రూ. 30,000, అన్నమనేని మణికంఠకు రూ. 25,341 మంజూరయ్యాయి.

కిష్కిందపాలెంకు చెందిన కొల్లి వంశీకృష్ణకు రూ. 21,346, దొక్కు లక్ష్మీకుమారికి రూ. 40,503, తాడిగిరిపాడుకు చెందిన గుమ్మడి శ్యామలకు రూ. 21,986, పోతర్లంకకు చెందిన బొల్లెద్దు ధనకుమారికి రూ. 23,541, క్రాపకు చెందిన మట్టా శివకు రూ. 33,800 చొప్పున ఆర్థిక సహాయం అందింది.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో సీఎంఆర్ ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందని తెలిపారు.

సీఎంఆర్ ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు తక్షణ ఆర్థిక ఉపశమనంతో పాటు భరోసాను కల్పిస్తోందన్నారు. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని నక్కా ఆనంద బాబు తెలిపారు.

ఆర్థిక సహాయం అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లకు, తమకు సిఫార్సు చేసి సహాయం అందేలా కృషి చేసిన నక్కా ఆనంద బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ నియామకం చేపట్టాలి



**కర్నూలు ( జర్నలిస్ట్ ఫైల్) :** డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ నియామకాన్ని వెంటనే చేపట్టాలని కోరుతూ కర్నూలు జిల్లా ఫ్యాప్టో నాయకులు జిల్లా విద్యాధికారికి ధర్నా నోటీస్ అందజేశారు. కర్నూలు జిల్లాలో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ పోస్టు కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసి, ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు నియామకం చేపట్టలేదని నాయకులు తెలిపారు. అనవాయితీ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని సెక్రటరీగా నియమించాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. గతంలో జిల్లా ఫ్యాప్టో నాయకత్వానికి జిల్లా విద్యాధికారి హామీ ఇచ్చినా ఇప్పటివరకు నియామకం జరగలేదని తెలిపారు. కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్, ఆప్టా జిల్లా అధ్యక్షుడు ఎం. మధుసూదన్‌రెడ్డి, ఫ్యాప్టో కర్నూలు సెక్రటరీ జనరల్ భాస్కర్ (బీటీఏ) నాయకత్వంలో జిల్లా విద్యాధికారికి ధర్నా నోటీస్ అందజేశారు. ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 31వ తేదీలోగా నియామకం చేపట్టకపోతే సెప్టెంబర్ 1న కర్నూలు జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని నోటీసులో పేర్కొన్నారు. కార్యక్రమంలో రవికుమార్ (యూటీఎఫ్), నవీన్ పాటిల్ (యూటీఎఫ్), జనార్దన్ (ఎస్టీయూ), సుంకన్న (ఎస్టీయూ), ఇస్మాయిల్ (ఏపీటీఎఫ్-1938), ఖాసీం జి (ఏపీటీఎఫ్-257), హుస్సేన్ (ప్రధానోపాధ్యాయ సంఘం), భీమన్న (డీటీఎఫ్), గోపాల్ (ఆప్టా)తో పాటు ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హౌసింగ్ సౌకర్యం కల్పించాలి



- జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** అమరావతి వెలగపూడిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల జీరో అవర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలిచే జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రజా సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే కీలక బాధ్యతను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విలేఖరుల్లో అధిక శాతం మంది అత్యల్ప వేతనాలతో పనిచేస్తున్నారని, సొంత ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సవాల్‌గా మారిందని తెలిపారు. జర్నలిస్టుల వృత్తిలో స్థిరత్వం, నిర్దిష్టమైన పనివేళలు లేకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహనిర్మాణ పథకాలు వంటి ప్రోత్సాహకాలు జర్నలిస్టుల కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పిస్తాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టు కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రతి వర్గాన్ని తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారి అభ్యున్నతి కోసం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు గృహ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జి.ఓ. నెం. 67, 107లను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ జీవోలను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సభ ద్వారా కోరారు.

## స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు డిమాండ్ చేశారు. ఆరు సంవత్సరాలు ఒకే క్యాడర్‌లో పనిచేసిన ఉద్యోగులకు వర్తించే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు ఆగస్టు 5న జరిగిన సమావేశంలో అధికారులు వెల్లడించినప్పటికీ, 16 రోజులు గడిచినా అధికారిక ఉత్తర్వులు జారీ కాలేదని తెలిపారు. ఏఏఎస్‌పై వెంటనే ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు సచివాలయ ఉద్యోగులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇన్‌క్రిమెంట్ల సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు వారి విద్యార్హతలు, అనుభవం, నిర్వహిస్తున్న బాధ్యతలకు అనుగుణంగా జూనియర్ అసిస్టెంట్ క్యాడర్, తగిన పేస్కేల్ కల్పించాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను గుర్తించి, అర్హత కలిగిన స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగులను వారి విద్యార్హతలు, అనుభవం, సర్వీస్ ఆధారంగా జూనియర్ అసిస్టెంట్, తత్సమాన హోదాల్లో వన్‌టైమ్ ఆప్షన్ ద్వారా అబ్జార్ప్షన్ చేసి శాశ్వతంగా సర్దుబాటు చేయాలని కోరింది. టెక్నికల్ విద్యార్హతలు ఉన్న ఉద్యోగులకు సంబంధిత సాంకేతిక పోస్టుల్లో అవకాశం కల్పించాలని, అర్హత ఉన్నప్పటికీ పదోన్నతులు పొందని ఉద్యోగులందరికీ వెంటనే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

సచివాలయ వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తూ పరిపాలనా, సాంకేతిక, ప్రజాసేవా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల సేవలను గుర్తించి వారి న్యాయమైన సర్వీస్ సమస్యలకు ప్రభుత్వం సానుకూల పరిష్కారం చూపాలని కోరారు. ఏఏఎస్ ఉత్తర్వులు, నోషనల్ ఇన్‌క్రిమెంట్లు, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్, క్యాడర్ అప్‌గ్రేడేషన్, అబ్జార్ప్షన్, పెండింగ్ పదోన్నతులపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం జరిగితే ఏపీజేఏసీలో సభ్య సంఘంగా ఉన్న గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున అత్యవసర రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించి, ఏపీజేఏసీ నేతలతో కలిసి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ ప్రకటిస్తామని షేక్ మొహమ్మద్ జాని పాషా, బత్తుల అంకమ్మరావు స్పష్టం చేశారు.

## మిలాద్-ఉన్-నబీ సెలవు ఆగస్టు 26కి మార్పు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని గతంలో ప్రకటించిన ఆగస్టు 25, 2026 (మంగళవారం) సెలవును ఆగస్టు 26, 2026 (బుధవారం)కు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు సాధారణ పరిపాలన (పొలిటికల్-బి) శాఖ జి.ఓ.ఆర్.టి. నం.1675, తేదీ: 20-08-2026 జారీ చేసింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 కింద ఈ ఏడాది ప్రకటించిన మిలాద్-ఉన్-నబీ సెలవు తేదీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సవరించింది.

గతంలో ప్రకటించిన ఆగస్టు 25, 2026 (మంగళవారం) సెలవును ఆగస్టు 26, 2026 (బుధవారం)కు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (పొలిటికల్-బి) శాఖ జి.ఓ.ఆర్.టి. నం.1675, తేదీ: 20-08-2026 జారీ చేసింది.

ప్రభుత్వం గతంలో జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం.2277, తేదీ: 04-12-2025 ద్వారా మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఆగస్టు 25, 2026ను సెలవుగా ప్రకటించింది. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి సమర్పించిన నివేదిక ప్రకారం, రబీ ఉల్ అవ్వల్ మాసపు చంద్రదర్శనం 12-08-2026న జరగలేదని, చంద్రదర్శనం ఆధారిత లెక్కల ప్రకారం రబీ ఉల్ అవ్వల్ 12వ తేదీ అయిన మిలాద్-ఉన్-నబీ ఆగస్టు 26, 2026 (బుధవారం) నాడు వస్తుందని వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి నివేదించింది.

వక్ఫ్ బోర్డు సమర్పించిన అభ్యర్థనను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించిన అనంతరం, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 కింద మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ప్రకటించిన సెలవును ఆగస్టు 25 నుంచి ఆగస్టు 26, 2026కు మార్చాలని నిర్ణయించింది.

ఈ మేరకు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను పాక్షికంగా సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసాధారణ గెజిట్‌లో సవరణ నోటిఫికేషన్‌ను ప్రచురించనున్నారు.

## రెండో వైస్ ప్రెసిడెంట్, వైస్ ఛైర్‌పర్సన్ పదవుల తొలగింపునకు బిల్లు ఆమోదం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మండల ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ఛైర్‌పర్సన్ పదవులను తొలగించేందుకు ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (రెండో సవరణ) బిల్లు-2026కు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లో 2021లో చేసిన సవరణల ద్వారా మండల ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ఛైర్‌పర్సన్ పదవులను ఏర్పాటు చేశారని నాదెండ్ల మనోహర్ తెలిపారు. అయితే బహుళ నాయకత్వం కారణంగా స్థానిక పరిపాలనలో స్పష్టత తగ్గడంతో పాటు, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంలో ఈ పదవుల వల్ల అదనపు ప్రయోజనం చేకూరలేదని ప్రభుత్వం సమీక్షలో గుర్తించిందన్నారు.

దీంతో గతంలో ఉన్న విధానాన్ని పునరుద్ధరించేందుకు ఈ పదవులను తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

సవరణ బిల్లు అమల్లోకి వస్తే ప్రతి మండల ప్రజా పరిషత్‌కు ఒక వైస్ ప్రెసిడెంట్, ప్రతి జిల్లా ప్రజా పరిషత్‌కు ఒక వైస్ ఛైర్‌పర్సన్ మాత్రమే ఉంటారని మంత్రి వివరించారు. స్పష్టమైన నాయకత్వం, బాధ్యతల విభజనతో పాటు స్థానిక సంస్థల్లో పరిపాలనా సామర్థ్యం, సమన్వయం మరింత మెరుగుపడుతాయని పేర్కొన్నారు. మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో పరిపాలనా ప్రక్రియలను సరళీకృతం చేసేందుకు ఈ సవరణ దోహదపడుతుందని తెలిపారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో యువతే కీలకం



- భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్' సదస్సును ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువతను 28 జిల్లాల నుంచి సుమారు 500 మందిని సదస్సుకు ఆహ్వానించినట్లు చెప్పారు. న్యాయవాదులు, వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, రైతులు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, విద్యార్థులు తదితర రంగాలకు చెందిన యువత ఇందులో పాల్గొంటారని తెలిపారు.

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో ఎనిమిది ప్రత్యేక సెషన్లను నిర్వహించనున్నట్లు సునీల్‌రెడ్డి తెలిపారు. 2014కు ముందు, ఆ తర్వాత భారత్‌లో వచ్చిన మార్పులు, స్వాతంత్ర్య ఉద్యమంలో భారత పాత్ర, భారత నాగరికతా ప్రయాణం, విభజన, మహిళా నాయకత్వం, ప్రపంచ నాయకత్వం, 'ఇన్‌సైట్స్ ఫ్రమ్ మోదీ లీడర్‌షిప్', యూత్ ఓపెన్ మైక్ అండ్ లీడర్‌షిప్ డైలాగ్ తదితర అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. వికసిత్ భారత్‌తో పాటు వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ జిల్లాలు, గ్రామాల నిర్మాణంలో యువత భాగస్వామ్యంపై కూడా చర్చిస్తామని తెలిపారు. సదస్సు ప్రారంభ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ హాజరవుతారని, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వివిధ సెషన్లలో పాల్గొంటారని వెల్లడించారు.

దేశ నిర్మాణంలో రాజకీయాలతో పాటు వివిధ వృత్తుల్లో ఉన్న యువత భాగస్వామ్యం కావాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సునీల్‌రెడ్డి తెలిపారు. ప్రతి జిల్లాలో యువత కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు 'యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్'ను ప్రతి ఏడాది నిర్వహిస్తామని చెప్పారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి దేశాభివృద్ధిలో వారి పాత్రను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో యువతను వికసిత్ భారత్ నిర్మాణం వైపు నడిపించడమే బీజేవైఎం లక్ష్యమని పేర్కొన్నారు. 1947లో స్వాతంత్ర్యం సాధించిన భారత్ 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలు జరుపుకునే సమయానికి ప్రపంచంలో అగ్రదేశంగా ఎదగాలన్న లక్ష్యంతో యువతను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పైడికొండల సింధు, ప్రధాన కార్యదర్శులు నాగోతు హరికృష్ణ, అజేష్ యాదవ్, కార్యదర్శులు నవ్య, నరేంద్ర వర్మ, పాలసీ అండ్ సోషల్ మీడియా, లీగల్ సెల్ కో-కన్వీనర్లు తేజస్విని, వంశీ, రవినాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణారెడ్డి, కృష్ణా జిల్లా ఇన్‌చార్జి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467